Bhavani Publication Trust
https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక

రిపోర్టర్లు కావలెను
అధునాతన సాంకేతికతతో..
ఎప్పటి వార్తలు అప్పుడు అందించేందేందుకు
మీ ముందుకు వచ్చిన
ప్రజా టెలివిజన్
యూట్యూబ్ చానల్‌లో పని చేయుటకు
రిపోర్టర్లు కావలెను. ఎలాంటి టార్గెట్లు ఉండవు.
నిత్యనూతనంగా వార్తలు, లైవ్‌లు అందించడమే మీ పని..
సంప్రదించండి: 8309979541, 9494659622
ప్రజా TV
PRAJA TELEVISION
The People's Favour
మా యూట్యూబ్ చానల్‌ను
సపోర్ట్ చేయండి
8309979541
ప్రజా టెలివిజన్
తాజా వార్తలు, అప్‌డేట్,
లైవ్ ప్రోగ్రామ్‌ల కోసం లైక్, షేర్, సబ్‌స్క్రైబ్

సంపుటి : 25 | సంచిక : 163 | హైదరాబాద్ | గురువారం 19 జూన్ 2025 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR

# భారత్-పాక్ ఒప్పందంలో మీ ప్రమేయం లేదు

## అది ద్వైపాక్షిక కాల్పుల విరమణే.. ట్రంప్‌నకు తేల్చిచెప్పిన మోదీ

- అమెరికా అధ్యక్షుడితో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని
- అయినా పాత పాటే పాడిన ట్రంప్
- ఉగ్రవాదంపై ద్వంద్వ వైఖరి ఉండకూడదన్న మోదీ
- పాకిస్థాన్‌పై చర్యలు తీసుకోవాలని ప్రపంచ దేశాలకు పిలుపు
- జీ7 దేశాధినేతలతో భేటీ
- కెనడాతో సంబంధాల పునరుద్ధరణకు నిర్ణయం





కనానాస్కిస్: భారత్, పాకిస్థాన్ మధ్య గత నెలలో జరిగిన కాల్పుల విరమణ ఒప్పందంలో అమెరికా ప్రమేయమేమీ లేదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తేల్చిచెప్పారు. ఇది రెండు దేశాల సైన్యం చర్చలు జరిపి తీసుకున్న నిర్ణయమని, మధ్యవర్తి ఎవరూ లేరని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని తాను స్వయంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకే ఫోన్‌లో చెప్పానని మోదీ తెలిపారు. అయితే ట్రంప్ మళ్లీ పాత పాటే పాడారు. మోదీతో ఫోన్‌లో మాట్లాడిన అనంతరం.. తానే భారత్, పాక్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదిర్చానని మరోసారి వ్యాఖ్యానించారు. మరోవైపు ఉగ్రవాదంపై ప్రపంచానికి ద్వంద్వ వైఖరి ఉండకూడదని, సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌పై చర్యలు తీసుకోవాల్సిందేనని ప్రపంచ దేశాలకు మోదీ పిలుపునిచ్చారు. కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఆహ్వానం మేరకు అక్కడ జరిగిన జీ7 సదస్సులో పాల్గొన్న ఆయన.. అందులో ప్రసంగించడంతోపాటు పలువురు దేశాధినేతలతో భేటీ అయ్యారు. ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో ట్రంప్ అర్ధాంతరంగా కెనడా నుంచి వెళ్లిపోవడంతో ఆయనతో ఫోన్‌లో

- మిగతా 2వ పేజీలో



## ఉత్తర్వులు అమలు చేయకపోతే అధికారులకు జైలే!

### భూమిని కోల్పోయిన వ్యక్తికి మూడు నెలల్లో ప్లాటు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వండి

- లేకపోతే అర్వింద్‌కుమార్, ప్రసూనాంబలకు 2 వారాల జైలుశిక్ష
- కోర్టు ధిక్కరణ పిటిషన్‌లో హైకోర్టు తీర్పు

ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్

మూసీ సుందరీకరణలో భాగంగా సేకరించిన భూమికి ప్రత్యామ్నాయంగా 2016లో కేటాయించిన 666.67 చదరపు గజాల ప్లాటును యజమానికి రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని హామీ ఇచ్చి ఉల్లంఘించడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్లాటు అప్పగింతకు అన్ని చర్యలు తీసుకుంటామని పదే పదే కోర్టుకు హామీలు ఇస్తున్నారని, కోర్టు ధిక్కరణను తప్పించుకోవడానికే ఇలా చేస్తున్నారని, భూమిని కోల్పోయిన వ్యక్తికి న్యాయం చేయాలన్న ఉద్దేశం కనిపించడం లేదని వ్యాఖ్యానించింది. ఇకపై ఇలాంటి ఉదాసీనతను ఉపేక్షించబోమని స్పష్టం చేసింది. మూడు నెలల్లో ప్లాటు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని ఆదేశించింది. లేకపోతే గతంలో పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శిగా, హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా

- మిగతా 2వ పేజీలో

## బనకచర్ల..

# కేసీఆర్ పాపమే!

### 2016 నాటి ఎపెక్స్ కౌన్సిల్‌లో ఆయన వ్యాఖ్యలతోనే బీజం

- గన్‌తో భేటీలోనూ నీటి తరలింపును ప్రోత్సహించారు
- ఏపీ ప్రయత్నాలపై మేం తక్షణం అప్రమత్తమయ్యాం
- రాష్ట్ర ప్రయోజనాల కోసం న్యాయ, రాజకీయ పోరాటం
- అందరం వెళ్లి ప్రధానినీ కలుస్తాం
- గోదావరిలో 1000, కృష్ణాలో 500 టీఎంసీల వినియోగానికి చంద్రబాబు తెలంగాణకు ఎన్‌వోసీ ఇవ్వాలి
- అలా చేస్తే ఏపీలో ఎన్ని ప్రాజెక్టులైనా కట్టుకోవచ్చు
- అఖిలపక్ష భేటీ అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు



చంద్రబాబుకు సూచన చేస్తున్నా. మీరు పక్క రాష్ట్ర సీఎం.. కేంద్రంలో మీకు పలుకుబడి ఉండొచ్చు.. మీరేం చెబితే మోదీ అది వినొచ్చు.. అంతమాత్రాన.. బనకచర్లకు అన్ని అనుమతులు వస్తాయని అనుకోవడం భ్రమ. అలాంటి అవకాశం లేదు. తెలంగాణ ప్రయోజనాల్ని కాపాడుకునేందుకు అవసరమైన ప్రణాళిక, వ్యూహరచన మా వద్ద స్పష్టంగా ఉంది.

- సీఎం రేవంత్‌రెడ్డి

ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్

"ఏపీ చేపట్టిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు కేసీఆర్ హయాంలోనే బీజం పడింది. ఆనాడు పలుమార్లు ఆయన చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. తెలంగాణ ప్రయోజనాల విషయంలో మేం రాజీ పడం" అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్టు విషయమై బుధవారం అఖిలపక్ష ఎంపీలతో నిర్వహించిన భేటీ అనంతరం.. సీఎం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "ఈ ప్రాజెక్టును

- మిగతా 2వ పేజీలో



## తప్పుదోవ పట్టించేలా సీఎం అబద్ధాల ప్రవాహం

### ఎపెక్స్ కౌన్సిల్ మీటింగ్ ఎజెండా 5లోని అంశాలు కావాలనే దాచారు

మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు

ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్

ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ఉద్దేశపూర్వకంగా ఎపెక్స్ కౌన్సిల్ మీటింగ్ ఎజెండా 5లోని అంశాలు దాచి పెట్టి, ఎజెండా 1 అంశాలను మాత్రమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రస్తావించారని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు విమర్శించారు. ఎంపీల సమావేశంలో, మీడియా సమావేశంలోనూ సీఎం తన అబద్ధాల ప్రవాహాన్ని యథేచ్ఛగా కొనసాగించారని బుధవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. "బోడిగుండుకు మోకాలుకు లంకె పెట్టి మాట్లాడటంలో రేవంత్‌రెడ్డి సిద్ధహస్తులని మరోసారి రుజువైంది. ఎపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లో కేసీఆర్ చెప్పిన వాటిని ముఖ్యమంత్రి వక్రీకరించారు. రాజకీయ

- మిగతా 2వ పేజీలో



## నాణ్యమైన విద్యుత్తు.. నిరంతరాయ సరఫరా

### ఇదే మా ప్రభుత్వ ధ్యేయం

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

ప్రజాతీర్పు ప్రతినిధి, ఖమ్మం

రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు నాణ్యమైన విద్యుత్తును నిరంతరాయంగా సరఫరా చేయటమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. 2014-2023 వరకు రాష్ట్రాన్ని పాలించిన భారాస.. కనీసం విద్యుత్తు విధానాన్ని తీసుకురాలేకపోయిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్

- మిగతా 2వ పేజీలో





## మావోయిస్టుల మరో కీలక నేత గాజర్ల రవి ఎన్‌కౌంటర్

### ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు, చలపతి భార్య అరుణ..

2

రవి రక్షణ దళం సభ్యురాలు అంజూ మృత్యువాత

రంపచోడవరం అడవిలో ఘటన



## హక్కుల పరిరక్షణకు కలిసి నడుద్దాం

### ప్రభుత్వ విజ్ఞప్తికి వివిధ పార్టీల ఎంపీల మద్దతు

- బనకచర్ల ప్రాజెక్టుతో రాష్ట్రానికి తీవ్ర నష్టం
- కేంద్రం అనుమతులు ఇవ్వకుండా ఒత్తిడి తెద్దామన్న సర్కారు
- కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్తామన్న భాజపా ఎంపీలు
- రాష్ట్ర హక్కులు కాపాడడానికి కట్టుబడి ఉన్నామన్న భారాస
- సీఎం వ్యాఖ్యలను నిరసిస్తూ ఆ పార్టీ ఎంపీ వద్దిరాజు వాకౌట్

2

ఆంధ్రప్రదేశ్ చేపట్టిన పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు విషయంలో తెలంగాణ హక్కుల పరిరక్షణకు కలిసిరావాలన్న ప్రభుత్వ విజ్ఞప్తికి అఖిలపక్ష పార్టీల ఎంపీలు మద్దతు ప్రకటించారు.

# బనకచర్ల.. కేసీఆర్ పాపమే!

(మొదటి పేజీ తరువాయి)

అడ్డుకునేందుకు ఎవరినైనా కలుస్తాం. ఎవరితోనైనా కొట్లాడతాం. సామదాన భేద దండోపాయాల్లో మొదటి అంకంలో ఉన్నాం. గురువారం కేంద్ర జలశక్తి మంత్రితో సమావేశమవుతాం. అవసరమైతే ప్రధానినీ కలుస్తాం. అయినా ఫలితం లేకపోతే న్యాయస్థానాల్ని ఆశ్రయిస్తాం.

అక్కడా కాకపోతే రాజకీయ పోరాటం చేస్తాం. ” అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. “నదీ జలాల విషయంలో కేసీఆర్ చేసిన పాపంలో భాగంగానే బనకచర్ల ప్రాజెక్టు సమస్య కూడా వచ్చింది” అంటూ నిప్పులు చెరిగారు. “గోదావరి బేసిన్‌లో తెలంగాణ ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ అడ్డు పడుతోంది. గోదావరిలో 1,000, కృష్ణా నదిలో 500 మొత్తం 1,500 టీఎంసీల నీటిని తెలంగాణ వాడుకునేందుకు ఏపీ సీఎం చంద్రబాబు నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) ఇస్తే.. ఆ రాష్ట్రం కట్టుకునే ప్రాజెక్టులకు అడ్డు చెప్పబోం’ అని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

“భారాస నేతలు అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో మరోలా మాట్లాడుతూ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారు. 21.09.2016న కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఎపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కేంద్ర జలవనరుల శాఖ మంత్రి ఉమాభారతితో పాటు.. తెలుగు రాష్ట్రాల సీఎంలు కేసీఆర్, చంద్రబాబు.. మంత్రులుగా దేవినేని ఉమా, హరీశ్‌రావు పాల్గొన్నారు. గోదావరి, కృష్ణా నదీ జలాల వినియోగంపై సుదీర్ఘ చర్చలు జరిగాయి. ఎనిమిది పేజీల మీటింగ్ మినిట్లు (కాగితాల్ని చూపిస్తూ) ఉన్నాయి. ఆ సందర్భంలో కేసీఆర్.. “గోదావరి నుంచి మూడు వేల టీఎంసీల నీళ్లు సముద్రంలో కలుస్తున్నాయి. కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు వెయ్యి టీఎంసీల నీళ్లు అవసరం. గోదావరి నుంచి కృష్ణాకు నీళ్లు తరలించి ఉపయోగించవచ్చు” అని సూచించారు. అలా కేసీఆర్ వైఖరితో తెలంగాణకు జరగబోయే నష్టానికి పునాదిరాయి ఆనాడే పడింది. గోదావరి నుంచి రాయలసీమకు నీళ్లు ఇవ్వవచ్చని అన్నారు. ఈ మీటింగ్ మినిట్స్ హరీశ్‌రావుకు పంపిస్తా. కేసీఆర్, ఏపీ నాటి సీఎం జగన్ మధ్య ప్రగతిభవన్‌లో నాలుగు సమావేశాలు జరిగాయి. వారిద్దరూ కూర్చుని గోదావరి జలాల్ని రాయలసీమకు తరలించాలని నిర్ణయించారు. సీమకు గోదావరి జలాల తరలింపులో సహకరిస్తానని కేసీఆర్ ఆనాడే జగన్‌కు హామీ ఇచ్చారు. ఆనాడు కేసీఆర్, జగన్‌ల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారమే చంద్రబాబు ఇప్పుడు ముందుకు వెళుతున్నారు. ఇవాళ బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభిస్తామని చంద్రబాబు అనగానే.. భారాస వ్యతిరేకిస్తోంది. గోదావరి–బనకచర్లను కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ వ్యతిరేకిస్తోంది. నేను భారాసను, కేసీఆర్‌ను అడుగుతున్నా.. 2016లో, వివిధ సందర్భాల్లో, శాసనసభలో.. గోదావరి జలాల్ని రాయలసీమకు.. అదే విధంగా పెన్నా బేసిన్‌కు తరలించడాన్ని మీరు ఆమోదించారు. ప్రాజెక్టుల నిర్మాణం ప్రారంభించడానికి అవకాశం కల్పించారు. ఈ రోజు బనకచర్లను ప్రారంభిస్తామని ఏపీ సీఎం చంద్రబాబు అన్న మరుక్షణం.. నేను, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దిల్లీ వెళ్లి జలశక్తి మంత్రిని కలిసి ఫిర్యాదు చేశాం. ఇతర కేంద్ర మంత్రులకూ ఫిర్యాదు చేశాం. గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు దృష్టికీ తీసుకెళ్లాం. ఏపీ ప్రభుత్వం, ఏపీ సీఎం.. బనకచర్ల ద్వారా 200 టీఎంసీల గోదావరి జలాల్ని తరలించేందుకు ప్రణాళిక రూపొందించారని చెప్పాం. పరోక్షంగా మరో 100.. మొత్తం 300 టీఎంసీల తరలింపునకు సివిల్ పనులు చేస్తున్నారు. కాలువలు, సొరంగాలు, రిజర్వాయర్లు.. 300 టీఎంసీల కోసం నిర్మించేలా ప్రణాళిక వేశారు. ఆనాడు కేసీఆర్ 400 టీఎంసీల తరలింపునకు ప్రతిపాదన ఇచ్చారు. రాయలసీమ, పెన్నా బేసిన్లకు తరలించవచ్చని కేసీఆర్ సూచించారు.

బనకచర్లపై రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో స్పందిస్తుంటే హరీశ్ మాత్రం నాపై, ఉత్తమ్‌పై బురద చల్లుతున్నారు. ఈ పాపానికి పునాది వేసింది కేసీఆరే. 2016లో జరిగిన సమావేశంలో హరీశ్‌రావు ఉన్నారు. నదీ జలాల్లో తెలంగాణకు జరిగిన నష్టంపై కేసీఆర్‌ని, హరీశ్‌రావునే శిక్షించాలి. కాంట్రాక్టర్లు ఇచ్చే కమీషన్ల కోసం భారాస తెలంగాణకు అన్యాయం చేసింది. ఒక కాంట్రాక్టర్ పెట్టిన సమావేశంలో కూర్చుని.. కమీషన్లకు కక్కుర్తి పడి.. గోదావరి వరదజలాల్లో 400 టీఎంసీల నీళ్లను రాయలసీమకు తీసుకెళ్లవచ్చని అన్నారు. ఇప్పుడు మీ చేతిలో అధికారం లేదని.. ఆ బురదను మాకు అంటిస్తారా? నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో పార్టీని పెట్టి అధికారంలోకి వచ్చిన మీరు.. కృష్ణా బేసిన్‌లో (ఉమ్మడి ఏపీలో) చేపట్టిన ఒక్క ప్రాజెక్టునైనా పూర్తి చేశారా కేసీఆర్? ఆనాడు తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్టు కట్టి ఉంటే.. లిఫ్టు లేకుండానే గ్రావిటీ ద్వారానే ప్రాజెక్టులన్నీ పూర్తయ్యి.. ఉత్తర తెలంగాణ సస్యశ్యామలం అయ్యేది. కానీ కాసుల కక్కుర్తితో తుమ్మిడిహెట్టి దగ్గర కట్టకుండా వదిలేశారు. కాళేశ్వరం వల్ల రూ.లక్ష కోట్ల ధనం ఆవిరైపోయింది. కేసీఆర్ ధనదాహం.. దోపిడీ వల్ల మేడిగడ్డ కుప్పకూలింది. ఒక్క పిల్లర్ కూలిపోతే ఏమైంది ప్రాజెక్టు ఉంది కదా? అంటున్నారు హరీశ్‌రావు. మేడిగడ్డ గుండెకాయ లాంటిది. ఆ గుండెనే లేకపోతే మిగతా శరీరం ఎందుకు? అఖిలపక్ష సమావేశం పెడితే భారాస ముఖ్య నాయకులు రాలేదు. రాయలసీమ ఎత్తిపోతల జీఓ కేసీఆర్ ఇంట్లో తయారైంది. చంద్రబాబు ముచ్చుమర్రి కడుతుంటే కేసీఆర్ మాట్లాడలేదు.

చంద్రబాబుకు సూచనలు చేస్తున్నా.. గోదావరిలో మూడు వేల టీఎంసీల మిగులు జలాలు ఉన్నాయని మీరు నమ్మితే.. గోదావరి బేసిన్‌లో తెలంగాణకు 968 టీఎంసీల నీటి కేటాయింపులున్నాయి. ఆ నీటికి బ్లాంకెట్‌గా ఎన్‌ఓసీ మీరు ఇవ్వండి. తెలంగాణలో 968 టీఎంసీలకు ప్రాజెక్టులు కట్టుకున్నాక.. కిందికి వెళితే అవి వరదజలాలు అవుతాయి. కేసీఆర్ తెలంగాణకు చేసిన ద్రోహం వల్ల మిగులు జలాలు ఏపీకి వరదగా వెళుతున్నాయి. మేడిగడ్డ కూలింది.. అన్నారం అక్కరకు రాలేదు.. అవి సక్రమంగా ఉండి ఉంటే.. నీళ్లు మేం ఎత్తిపోసుకుంటే.. మిగులు జలాలు ఏపీకి వచ్చేవో, రావో తెలిసేది. కృష్ణా బేసిన్ మొత్తాన్ని ఏపీ కొల్లగొట్టింది. ఇప్పుడు గోదావరి బేసిన్‌కు వచ్చింది. చివరగా చంద్రబాబుకు నేను చెప్పేది ఒక్కటే.. మనం దూరం పెంచుకోవడం ద్వారా సమస్య పరిష్కారం కాదు.. మా తెలంగాణ ప్రాజెక్టులకు గోదావరి బేసిన్‌పై 968 టీఎంసీలు.. కృష్ణా బేసిన్‌లో పరీవాహక ప్రాంతం ప్రకారం... 555 టీఎంసీల నీళ్లు వస్తాయి.. మేం కొన్ని ప్రాజెక్టులు కట్టుకుంటాం. ఈ రెండింటికీ మీరు స్పష్టంగా అనుమతి ఇవ్వండి. ఆ తర్వాత సముద్రంలోకి వెళ్లే నీటిని మీరు ఎంత తీసుకెళ్లినా మాకు అభ్యంతరం లేదు.

కీలకమైన అఖిలపక్ష సమావేశానికి రాకుండా పని ఉందంటూ దిల్లీ వెళ్లిన కిషన్‌రెడ్డిని నమ్మే పరిస్థితి లేదు. గురువారం జలశక్తిమంత్రిని మేం కలవబోతున్నాం. ఆయన ఒక రోజు ముందే జలశక్తిమంత్రిని ఎందుకు కలిశారు? అన్నిరకాలుగా తెలంగాణకు ద్రోహం చేస్తున్నారు. నీళ్ల సెంటిమెంట్‌తో భారాసను బతికించాలని ఆయన ప్రయత్నిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మంత్రి మండలి సమావేశాల మినిట్స్ ఇవ్వాలని జస్టిస్ ఘోష్ కమిషన్ కోరింది. గత ప్రభుత్వంలో 96 సార్లు మంత్రి మండలి సమావేశాలు జరిగినా ప్రాజెక్టు అంచనాలు పెంచడానికి చేసిన తీర్మానాలు మినహా నిర్మాణానికి సంబంధించి మినిట్స్ లేవు. ఎటువంటి ఆమోదం లేకుండానే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును కాళేశ్వరంగా మార్చి నిర్మించారు. ఈ వివరాలు తెలిపితే సీఎం కాళేశ్వరం కమిషన్‌ను ప్రభావితం చేస్తున్నారంటూ న్యాయ వివాదాలకు దిగుతారు. ఈ నెల 30వ తేదీలోపు నీటిపారుదల శాఖ కమిషన్ కోరిన అంశాలన్నింటినీ అందజేస్తుంది” అని ముఖ్యమంత్రి వివరించారు. “రోజుకు 2 టీఎంసీల చొప్పున.. 400 టీఎంసీల నీటిని రాయలసీమకు తరలించాలని కేసీఆర్, జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారు. ఆనాటి సమావేశ మినిట్స్‌లో ఇవన్నీ ఉన్నాయి. గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు అకస్మాత్తుగా మొదలైంది కాదు. 2016లోనే దీనికి బీజం పడింది. 2019లో ఒక దశకు వచ్చింది. 2025కు వచ్చేసరికి వేగవంతమైంది” అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గోదావరి–బనకచర్లపై జరిగిన అఖిలపక్ష భేటీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడారు. “అన్ని పార్టీలకు సిద్ధాంతాల పరంగా విభేదాలుండొచ్చు. కానీ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజకీయాలకు అతీతంగా.. అందరం కలిసికట్టుగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది. దీనిపై భాజపా ఎంపీ రఘునందన్‌రావు ఒక సందేహం వెలిబుచ్చారు. ప్రాజెక్టులు పూర్తయి.. నికర జలాలు వాడుకున్న తర్వాత.. మిగిలితే వరద జలాలో.. మిగులు జలాలో కానీ.. ఇప్పుడు ప్రాజెక్టులకే అనుమతులు లేవు. మిగులు జలాలనేది ఎలా వచ్చింది? అని అడిగారు. దీనిపై వివరణ ఇవ్వదలుచుకున్నా. తెలంగాణ ఏర్పడిన తరువాత కేంద్రప్రభుత్వం దిల్లీలో 21-9-2016న నిర్వహించిన ఎపెక్స్ కౌన్సిల్ సమావేశంలో.. గోదావరి నది నుంచి మూడు వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయని ఆనాటి సీఎం కేసీఆర్ ప్రస్తావించారు.

# హక్కుల పరిరక్షణకు కలిసి నడుద్దాం

**ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్**

ఈ ప్రాజెక్టుపై కార్యాచరణకుగాను బుధవారం హైదరాబాద్‌లోని బీఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయంలో నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్రానికి చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కాగా... భాజపా ఎంపీలు డీకే అరుణ, రఘునందన్‌రావు, భారాస ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతోపాటు కాంగ్రెస్ ఎంపీలు, నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బనకచర్ల ప్రాజెక్టుపై ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, గోదావరి బేసిన్ ప్రాజెక్టులపై డిప్యూటీ డైరెక్టర్ సుబ్రహ్మణ్య ప్రసాద్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ప్రాజెక్టులు, వాటి కింద నీటి వినియోగం, సబ్ బేసిన్‌లోని ప్రవాహాల వివరాలను వెల్లడించారు. సమావేశం అనంతరం అన్ని పార్టీల ఏకాభిప్రాయంతో తీర్మానం చేద్దామని సీఎం ప్రతిపాదించారు. సమావేశంలో సీఎం చేసిన వ్యాఖ్యలు రాజకీయ ప్రయోజనాలు కాపాడుకునేలా ఉన్నాయని నిరసిస్తూ భారాస ఎంపీ వద్దిరాజు రవిచంద్ర వాకౌట్ చేశారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు మద్దతు ఇవ్వనున్నట్లు ఎంఐఎం ఎంపీ పేర్కొన్నారు. పోలవరం నుంచి బనకచర్లకు గోదావరి నీటిని మళ్లించేందుకు ఏపీ సిద్ధమవుతున్నట్లు తెలిసిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బనకచర్లను అడ్డుకునేందుకు అన్ని పార్టీలు కలిసి పోరాటం చేద్దామని ప్రతిపాదించారు. రాష్ట్రం వాదనలను వినిపించేందుకు న్యాయనిపుణుల పేర్లను సూచించాలని అఖిలపక్ష పార్టీల ఎంపీలను కోరారు.

బనకచర్ల ప్రాజెక్టుపై రాజకీయ ప్రయోజనాల కన్నా రైతాంగ ప్రయోజనాలే ముఖ్యమని మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ సందర్భంగా పేర్కొన్నారు. ‘ప్రాజెక్టుపై ఉన్న అభ్యంతరాలను కేంద్ర మంత్రులు సీఆర్ పాటిల్, భూపేంద్ర యాదవ్‌ల దృష్టికి తీసుకెళ్తున్నాం. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రానికి చెందిన ఎంపీలంతా ప్రతిఘటించాలని కోరాం. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో రాష్ట్ర ప్రయోజనాలకు తీవ్ర విఘాతం తప్పదు. రూ.81,900 కోట్లతో పోలవరం జలాశయం నుంచి కృష్ణా నది మీదుగా వరద నీటిని పెన్నాకు తరలించడానికి మూడు భాగాలుగా నిర్మిస్తున్నారు. 417 కిలోమీటర్ల దూరంలో కాలువలు, పైపులు, సొరంగాలతో పాటు తొమ్మిది విద్యుత్ ఆధారిత ఎత్తిపోతల పథకాలకు రూపకల్పన చేశారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు ఆపరేషన్ షెడ్యూల్‌ను మార్చడమే కాకుండా గోదావరి జల వివాదాల ట్రైబ్యునల్ ఆదేశాలను కూడా విస్మరిస్తున్నారు. గోదావరి జలాశయాల్లో 968 టీఎంసీల నీటి వాటాను కాదని అదనపు వరద నీటిని తరలించుకునే ఎత్తుగడలో భాగంగానే ఈ ప్రాజెక్టుకు ఏపీ రూపకల్పన చేసింది. భద్రాచలం రామాలయంతో పాటు మణుగూరు హెవీ వాటర్ ప్లాంట్, దుమ్ముగూడెం నుంచి తెలంగాణ–ఏపీ సరిహద్దుల్లో ఉన్న గ్రామాలు ముంపునకు గురవుతాయి. గోదావరి నీటి సమస్యల ట్రైబ్యునల్ తుది ఉత్తర్వుల ప్రకారం తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సూచనల మేరకే షెడ్యూల్‌లో మార్పులు చేయాలన్న నిబంధనలు ఉన్నాయి’ అని ఉత్తమ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ నుంచి ఎంపీలు మల్లు రవి, అనిల్‌కుమార్ యాదవ్, బలరాం నాయక్, వంశీకృష్ణ, సురేష్ షెట్కార్, రఘువీర్, రేణుకాచౌదరి, రఘురాంరెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

# భారత్-పాక్ ఒప్పందంలో మీ ప్రమేయం లేదు

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని మాట్లాడారు. ఇక కెనడా ప్రధాని మార్క్ కార్నీతో చర్చల సందర్భంగా రెండు దేశాల మధ్య దెబ్బతిన్న సంబంధాలను పునరుద్ధరించుకోవాలని నిర్ణయించారు.

జీ7 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా మోదీ, ట్రంప్‌ల మధ్య ద్వైపాక్షిక భేటీ జరగాల్సి ఉంది. ట్రంప్ ముందుగానే వెళ్లిపోవడంతో ఇరు దేశాధినేతలు 35 నిమిషాలపాటు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ‘భారత్ ఎన్నటికీ మధ్యవర్తిత్వాన్ని అంగీకరించదు. పాకిస్థాన్ విజ్ఞప్తితోనే రెండు దేశాల సైన్యం చర్చలు జరిపి కాల్పుల విరమణ నిర్ణయం తీసుకున్నాయి. దీనిపై భారత్‌లో రాజకీయ ఏకాభిప్రాయం ఉంది. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలనే మేం లక్ష్యంగా చేసుకున్నాం. మళ్లీ ఎప్పుడైనా పాకిస్థాన్ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడితే ఇలా గట్టి సమాధానమే ఉంటుంది’ అని ట్రంప్‌నకు మోదీ వివరించారు.

రష్యా, ఉక్రెయిన్ యుద్ధం, ఇండో పసిఫిక్ ప్రాంతంలో ఉద్రిక్తతలపై ఇద్దరు నేతలు చర్చించుకున్నారు.

కెనడా నుంచి అమెరికా రావాలని ట్రంప్ కోరగా.. వేరే కార్యక్రమాలు ఉన్నందున రాలేనని మోదీ తెలిపారు. భారత్‌లో జరిగే క్వాడ్ సమావేశంలో పాల్గొనేందుకు రావాలని ట్రంప్‌ను మోదీ ఆహ్వానించారు. దీనికి ఆయన అంగీకరించారు.

మోదీతో ఫోన్ చర్చల అనంతరం ట్రంప్ మళ్లీ పాతపాటే పాడారు. ‘మంచిది. నేను యుద్ధాన్ని ఆపా. పాకిస్థాన్‌పై నాకు ప్రేమ ఉంది. మోదీ అత్యద్భుత వ్యక్తి అని భావిస్తున్నా. మంగళవారం రాత్రి ఆయనతో ఫోన్‌లో మాట్లాడా. త్వరలో భారత్‌తో వాణిజ్య ఒప్పందం చేసుకోబోతున్నా. అయితే యుద్ధాన్ని ఆపా’ అని ట్రంప్ బుధవారం వ్యాఖ్యానించారు.

ఉగ్రవాదుల పుట్టుకకు భారత్ పొరుగు దేశం క్షేత్రంగా ఉందని, ఈ సవాలుపై ప్రపంచ నిర్లక్ష్యం మానవాళికి మనం చేసే అన్యాయమే అవుతుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. సీమాంతర ఉగ్రవాదానికి మద్దతిస్తున్న పాకిస్థాన్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. మంగళవారం జీ7 సదస్సులో ఇంధన భద్రతపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. “ఉగ్రవాదంపైప్రపంచ దేశాలకు ద్వంద్వ వైఖరి తగదు. ఉగ్రవాదం మానవాళికే శత్రువు. ఇది ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తోంది. దానిపై పోరాటంలో దేశాల మధ్య ఐక్యత అవసరం. ఉగ్రవాదం విషయంలో.. సొంత ప్రయోజనాలే లక్ష్యంగా ఒక చేత్తో ఆంక్షలను విధిస్తూనే, మరో చేత్తో దానికి ఊతమిచ్చేలా కొన్ని దేశాలు వ్యవహరిస్తున్నాయి. ఇప్పుడు మనం నిర్ణయాత్మక చర్యలు తీసుకోకపోతే చరిత్ర మనల్ని క్షమించదు. భావితరాలకు ఇంధన భద్రత కల్పించడం మనముందున్న అతి పెద్ద సవాళ్లలో ఒకటి. ఈ విషయంలో నేను అని కాకుండా మనం అనే ధోరణిలో సాగాలి. ప్రపంచంలో ఎక్కడ ఉద్రిక్తత తలెత్తినా ఆ భారం దక్షిణార్ధగోళ దేశాలపై పడుతోంది. ఈ దేశాలు ఆహారం, ఇంధనం, ఎరువులు, ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నాయి” అని మోదీ పేర్కొన్నారు.

భారత్, కెనడా రాజధానుల్లో హైకమిషనర్ల పునర్నియామకం చేపట్టాలని ఇరు దేశాల నేతలు నిర్ణయించారు. కెనడా ప్రధాని మార్క్ కార్నీ, ప్రధాని మోదీల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

ట్రంప్ గైర్హాజరీలో జరిగిన జీ7 సదస్సులో కీలక అంశాలపై సంయుక్త ప్రకటన విషయంలో ఏకాభిప్రాయం కుదరలేదు. రష్యా–ఉక్రెయిన్, ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధాలపై చర్చించినా అంగీకారం కుదరలేదు.

**దేశాధినేతలతో కీలక చర్చలు**

ప్రపంచం ఎదుర్కొంటున్న పలు సవాళ్లపై జీ7 దేశాధినేతలతో మోదీ ఫలవంతమైన చర్చలు జరిపారు. కెనడా, దక్షిణ కొరియా, మెక్సికో, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, ఇటలీ, జర్మనీ, బ్రెజిల్ తదితర దేశాధినేతలతో ఆయన భేటీ అయ్యారు. వారితో దిగిన ఫొటోను ఆయన ఎక్స్‌లో పంచుకున్నారు.

ఉగ్రవాదంపై భారత్ పోరాటానికి మద్దతుగా నిలిచిన మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్‌కు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. వ్యవసాయం, సెమీకండక్టర్లు, కీలక ఖనిజాలు, ఆరోగ్యంతోపాటు మరిన్ని రంగాల్లో సహకరించుకోవాలని నేతలిద్దరూ నిర్ణయించారు.

దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్‌తో జరిగిన సమావేశంలో.. వాణిజ్యం, పెట్టుబడులు, టెక్నాలజీ, గ్రీన్ హైడ్రోజన్, ఓడల నిర్మాణ రంగాల్లో సహకరించుకోవాలని నిర్ణయించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్‌తో జరిగిన సమావేశంలో.. మెరుగైన ప్రపంచం కోసం చేపట్టాల్సిన చర్యల గురించి చర్చించారు. ‘ఈ మధ్య మీరు ‘ఎక్స్’లో బాగా యాక్టివ్‌గా ఉన్నారు’ అని సరదాగా మెక్రాన్‌తో మోదీ వ్యాఖ్యానించారు.

బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో జరిగిన సమావేశంలో వాణిజ్యంపై చర్చలు జరిపారు.

భారత్‌తో తమ బంధం మరింత బలంగా కొనసాగుతుందని ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ స్పష్టం చేశారు. వారిద్దరు తీసుకున్న సెల్ఫీని ఆమె సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. గొప్ప స్నేహ బంధం అని ఆమె దానికి క్యాప్షన్ రాశారు.

జర్మనీ ఛాన్సలర్ మెర్జ్‌తో జరిగిన సమావేశంలో వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, హరిత ఇంధనం, టెక్నాలజీల్లో సహకారంపై మోదీ చర్చించారు.

# మావోయిస్టుల మరో కీలక నేత గాజర్ల రవి ఎన్‌కౌంటర్

**ప్రజాతీర్పు ప్రతినిధి, అమరావతి**

మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలం కింటకూరు సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో బుధవారం వేకువజామున ఏపీ గ్రేహౌండ్స్ బలగాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గాజర్ల రవి ఎలియాస్ ఉదయ్ ఎలియాస్ గణేష్(60), ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు వీఆర్ఎల్ చైతన్య ఎలియాస్ అరుణ(50), రవి రక్షణ దళ సభ్యురాలు అంజూ ఎలియాస్ మాసే(24) ప్రాణాలు కోల్పోయారు. ఘటనా స్థలం నుంచి మూడు ఏకే47 రైఫిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. మరికొందరుమావోయిస్టులు తప్పించుకుని ఉంటారని భద్రత బలగాలు భావిస్తున్నాయి. ఏవోబీలో పనిచేస్తున్న మావోయిస్టులు కొన్నాళ్లుగా ఛత్తీస్‌గఢ్‌లో తలదాచుకుంటున్నారు. అక్కడ దాడులు, నిర్బంధం అధికమవడంతో... ఏవోబీలోకి వచ్చేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా కింటకూరు అడవిలోకి మావోయిస్టులు ప్రవేశించారనే సమాచారంతో గ్రేహౌండ్స్ బలగాలు గాలింపులు చేపట్టగా ఎదురుకాల్పులు జరిగాయి.

మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల రవి 35 ఏళ్ల ఉద్యమ ప్రస్థానం ముగిసింది. ఆయన గత పదేళ్లలో 12 ఎన్‌కౌంటర్ల నుంచి తప్పించుకున్నారు. కొన్నాళ్లుగా ఛత్తీస్‌గఢ్‌లో ఉంటున్న ఆయన ఏవోబీలోకి తిరిగొస్తూ ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయారు. తెలంగాణలోని భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాల ఆయన స్వగ్రామం. హనుమకొండలో చదువుకుంటున్న సమయంలో తన సోదరుడు ఆజాద్ స్ఫూర్తితో పీపుల్స్‌వార్‌లో అడుగుపెట్టి 1990లో మహదేవ్‌పూర్ దళ సభ్యుడిగా ప్రస్థానం ప్రారంభించారు. అంచెలంచెలుగా ఎదిగి 2004లో రాష్ట్ర కమిటీ సభ్యుడిగా పదోన్నతి పొందారు. 2009లో ఏవోబీకి వెళ్లి స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. 2019 నుంచి కేంద్ర కమిటీ(సీసీ) సభ్యుడిగా, ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఈ ప్రాంతంలో అనేక దాడులు, ఆపరేషన్లు చేశారు. 2018లో అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమల హత్యలో ప్రధాన నిందితుడు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2004 అక్టోబరులో జరిపిన శాంతి చర్చల్లో పీపుల్స్‌వార్ తరఫున ప్రతినిధులుగా హాజరైన ముగ్గురిలో గాజర్ల రవి ఒకరు. నాటి ఏపీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి హోదాలో రామకృష్ణ ఎలియాస్ ఆర్కే, ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి హోదాలో చలం ఎలియాస్ సుధాకర్‌లు హాజరుకాగా... ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి హోదాలో రవి ఆ చర్చల్లో పాల్గొన్నారు. అజ్ఞాతంలో ఉన్నప్పటికీ గాజర్ల రవి సెల్‌ఫోన్‌ను, ఇంటర్నెట్‌ను విస్తృతంగా వినియోగించేవారు. వారానికి రెండు, మూడుసార్లు ట్యాబ్‌లో నెట్ బ్రౌజ్ చేసేవారు. రాత్రి 10 గంటల తర్వాత సెంట్రీలను వెంటబెట్టుకుని ఇంటర్నెట్ సిగ్నల్స్ అందే ప్రాంతానికి వెళ్లేవారు. అవసరమైన సమాచారాన్ని, వార్తాపత్రికలను డౌన్‌లోడ్ చేసుకునేవారు. కావాల్సిన వారితో సంప్రదింపులు జరిపేవారు. దాదాపు 3–4 గంటల బ్రౌజింగ్ తర్వాత స్థావరానికి తిరిగి చేరుకునేవారు. ఆయన అలవాట్లు, దినచర్య, కదలికలపై నిఘా సంస్థలు రూపొందించిన నివేదికలో ఈ వివరాలున్నాయి.

## నాణ్యమైన విద్యుత్తు.. నిరంతరాయ సరఫరా

(మొదటి పేజీ తరువాయి)

అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే పాలసీ తెచ్చామని తెలిపారు. భారాస హయాం కన్నా ఇప్పుడు ఎక్కువ వినియోగం ఉన్నప్పటికీ.. ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా కరెంటు అందిస్తున్న ఘనత కాంగ్రెస్ సర్కారుకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా అందుబాటులోకి తీసుకొచ్చిన విద్యుత్తు అంబులెన్సులను రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డితో కలిసి ఖమ్మంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో బుధవారం ఆయన ప్రారంభించారు. భట్టి మాట్లాడుతూ.. 2023లో గరిష్ఠంగా 15వేల మెగావాట్ల విద్యుత్తు డిమాండ్ ఏర్పడిందని, 2025 మార్చిలో ఇది 17,162 మెగావాట్లకు చేరుకున్నప్పటికీ కోతలు లేకుండా చూశామని వెల్లడించారు. 2029–30 నాటికి 26 వేల మెగావాట్లకు, 2034–35 నాటికి 33,773 మెగావాట్లకు డిమాండ్ ఉంటుందనే అంచనాతో విద్యుదుత్పత్తికి చర్యలు చేపట్టామని తెలిపారు. ఇందులో 20వేల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్తు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. రూ.లక్ష కోట్లతో సోలార్ విద్యుత్తు కేంద్రాల ఏర్పాటుకు ఇప్పటికే ఎంవోయూలు కుదుర్చుకున్నామని వివరించారు. విద్యుత్తు అంబులెన్సులను త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. 1912 నంబర్‌కు ఫోన్ చేస్తే ఈ అంబులెన్స్‌లో సిబ్బంది వచ్చి విద్యుత్ మరమ్మతులు చేస్తారని తెలిపారు. విద్యుత్తు సిబ్బందికి ఎలక్ట్రికల్ సేఫ్టీ టూల్ కిట్లను మంత్రి అందజేశారు. గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నాయుడు సత్యనారాయణ, నగర మేయర్ నీరజ, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## ఉత్తర్వులు అమలు చేయకపోతే అధికారులకు జైలే!

(మొదటి పేజీ తరువాయి)

పనిచేసిన అర్వింద్‌కుమార్, హెచ్ఎండీఏ భూసేకరణ అధికారిగా పనిచేసిన ప్రసూనాంబలు రెండు వారాల జైలుశిక్ష అనుభవించడంతో పాటు రూ.వెయ్యి జరిమానా చెల్లించాల్సి ఉంటుందని తీర్పు వెలువరించింది. హైదరాబాద్‌లోని ఉప్పల్ భగాయత్‌లో మూసీ సుందరీకరణ నిమిత్తం చేపట్టిన భూసేకరణలో భూమి కోల్పోయిన ఎస్.రాంరెడ్డికి కేటాయించిన ప్లాటు రిజిస్టర్ చేయించి ఇవ్వాలంటూ హైకోర్టు 2023 ఫిబ్రవరిలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను అమలు చేయకపోవడంతో ఆయన కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సి.వి.భాస్కర్‌రెడ్డి ఇటీవల విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... భూసేకరణలో భాగంగా తీసుకున్న ఎకరానికి పరిహారం కింద అభివృద్ధి చేసిన వెయ్యి గజాల ప్లాటు కేటాయించాలన్న హెచ్ఎండీఏ సిఫారసు చేయగా, ప్రభుత్వం ఆమోదించిందన్నారు. పిటిషనర్‌కు 666.67 చదరపు గజాల ప్లాటు కేటాయించినా, రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వకపోవడంతో 2011లో పిటిషన్ దాఖలు చేశారన్నారు. ప్లాటు రిజిస్టర్ చేసివ్వాలంటూ హైకోర్టు ఆదేశించినా అమలు చేయకపోవడంతో మరోసారి 2020లో పిటిషన్ దాఖలు చేశారని తెలిపారు. మూడు నెలల్లో రిజిస్టర్ చేయాలని హైకోర్టు 2023 ఫిబ్రవరిలో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. ఈ ఆదేశాలనూ అమలు చేయకపోవడంతో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. పురపాలకశాఖ కౌంటరు దాఖలు చేస్తూ... పిటిషనర్‌కు కేటాయించిన ప్లాటుపై మరో వ్యక్తి హైకోర్టును ఆశ్రయించి స్టే పొందినందువల్ల కేటాయించలేకపోయామని, ఇందులో ఉద్దేశపూర్వక కోర్టు ధిక్కరణ లేదని పేర్కొంది. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి... పిటిషనర్ రెండోసారి హైకోర్టును ఆశ్రయించినపుడు మూడు నెలల్లో ప్లాటు అప్పగిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయినా అమలు చేయకపోవడంతో కోర్టు ధిక్కరణ పిటిషన్ వేయగా... ప్లాటు అప్పగిస్తామంటూ 2024 జనవరిలో మరోసారి హామీ ఇచ్చారన్నారు. ఏడాది దాటినా స్టే ఎత్తివేయాలని గాని, అప్పీలు వేయడం గాని చేయలేదన్నారు. పిటిషనర్‌కు ప్లాటు కేటాయించడం గాని, పరిహారం చెల్లించడం గాని చేయలేదని పేర్కొన్నారు. మూడు నెలల్లో ప్లాటును రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వకపోతే అర్వింద్‌కుమార్, ప్రసూనాంబలు రెండు వారాల జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పు వెలువరించారు.

## తప్పుదోవ పట్టించేలా సీఎం అబద్ధాల ప్రవాహం

(మొదటి పేజీ తరువాయి)

లబ్ధి పొందాలనే వక్ర బుద్ధే తప్ప.. తెలంగాణ నీటి ప్రయోజనాలు కాపాడాలనే తపన రేవంత్‌కు లేదు. గోదావరి–కృష్ణా నదుల అనుసంధానం ప్రాజెక్టుల విషయంలో తెలంగాణను సంప్రదించకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ ముందుకు పోకూడదని, ఒకవేళ వెళ్తే అందుకు తెలంగాణ అంగీకరించదని కేసీఆర్ ఎజెండా 5లో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ విషయాన్ని కావాలని దాచిపెట్టి, స్వార్థపూరిత రాజకీయ లక్ష్యాల కోసం సీఎం అసత్యాలను ప్రజల ముందు ఉంచారు. మీడియాను సైతం తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. అబద్ధాల పునాదుల మీద జరిగిన ఈనాటి రేవంత్ తతంగాన్ని ప్రజలు విశ్వసించరు” అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# ఈనెల 30న యాదవుల ఆత్మగౌరవ సభ..యాదవ బిడ్డలంతా భారీగా తరలిరావాలి

- బీసీ జన సభ రాష్ట్ర అధ్యక్షులు
- డి రాజారాం యాదవ్ పిలుపు

**నర్సంపేట జూన్ 18(ప్రజాతీర్పు)**

దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించడమే కాకుండా,రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న యాదవ జాతికి కేబినెట్ లో చోటు లేకపోవడం సిగ్గుచేటని రాజారాం యాదవ్ అన్నారు.బుధవారం నర్సంపేట మాదన్నపేట రోడ్డులో యాదవ సంఘం కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి యాదవ సంఘాల జాక్ నర్సంపేట నియోజకవర్గ బాధ్యులు బీసీ ప్రజాసంఘాల రాష్ట్ర నాయకులు ఆబోతు రాజు యాదవ్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.సభ అధ్యక్షులు ఆబోతు రాజు యాదవ్.యాదవులు ఆర్థికంగా రాజకీయంగా అభివృద్ధి చెందుకుంటూనే బీసీలకు అండగా నిలవాలని అన్నారు.ఈ కార్యక్రమ ముఖ్య అతిథులు బీసీ జన సభ రాష్ట్ర అధ్యక్షులు రాజారాం యాదవ్ అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడంగి గోవర్ధన్ యాదవ్, తెలంగాణ యాదవ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షులు మేకల కృష్ణ యాదవ్,అఖిల భారత యాదవ మహాసభ జనగాం జిల్లా అధ్యక్షులు బిసి కులాల ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బనుక సిద్ధిరాజ్ యాదవ్ పాల్గొన్నారు. ఈనెల 30న హైదరాబాదులో జరిగే యాదవుల ఆత్మగౌరవ సభకు భారీసంఖ్యలో రావాలని పిలుపునిచ్చారు.అనంతరం రాజారాం యాదవ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలు లేరు అనే సాకుతో యాదవ జాతిని వెనకబాటుకు గురిచేయవద్దని,వెంటనే మంత్రి పదవి కేటాయించాలని కోరారు. ప్రతీ జిల్లాలో,నియోజకవర్గంలో యాదవ కులస్తులు ఆవేదనతో ఉన్నారని చెప్పారు.నీతికి, నిజాయితీకి ప్రతీక యాదవ జాతి అని చెప్పే కాంగ్రెస్ పెద్దలు తక్షణమే మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు.సీఎం రేవంత్ రెడ్డి మంచి మనస్సుతో అలోచించి కులానికి పదవి కల్పించాలని విన్నవించారు. ఈనెల 30వ తేదీన యాదవుల ఆత్మగౌరవ సభ ఇందిరా పార్క్ లో నిర్వహిస్తున్నామని, యాదవ బిడ్డలంతా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునించారు.

**ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా..**
**లొడంగి గోవర్ధన్ యాదవ్**



యాదవ జేఏసీ ఆధ్వర్యంలో జూన్ 30న ఇందిరా పార్క్ లో యాదవ ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నామని లొడంగి గోవర్ధన్ యాదవ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కనివిప్పు కలిగేలా ఈ సభ ఉండబోతోందని పేర్కొన్నారు. సభను విజవంతం చేయడానికి ఉమ్మడి వరంగల్ జిల్లా యాదవులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో యాదవులకు మంత్రి పదవి లేకపోవడం దుర్మార్గపు చర్య అని అభివర్ణించారు. హిందూ జాతికి భగవద్గీతను అందించిన జాతి యాదవ జాతి అని,తెలంగాణలో గోల్కొండను నిర్మించిన చరిత్ర యాదవ జాతిదని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మళ్లీ నింపబోయే కేబినెట్ పదవుల్లో యాదవ జాతికి పెద్ద పీట వేయాలని కోరారు.అలాగే జనాభా ధమాషా పద్ధతిలో యాదవులకు రావాల్సిన నామినేటెడ్ పదవులు ఇవ్వాలన్నారు.గతంలో బీఆర్ఎస్ హయాంలో జరిపిన సమగ్ర కుటంబ సర్వేలో ముస్లింలు లేకుండా బీసీలు 52% ఉన్నారని, కానీ ఇప్పుడు ముస్లింలను కలుపుకొని 56% బీసీలు ఉన్నారు అని చెప్పడం సిగ్గుచేటన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42% స్థానిక సంస్థల్లో బీసీలకు అవకాశం కల్పించాలని కోరారు. యాదవులు, మున్నూరుకాపులు లేని మంత్రి మండలి ఉండటం బాధాకరమని పేర్కొన్నారు.కాంగ్రెస్ కు మున్నూరుకాపులు కే కేశవరావు, డీఎస్ లాంటి వారు ఎన్నో సేవాలు చేశారని చెప్పారు.బీసీలకు మంత్రి మండలిలో సముచిత స్థానం కల్పించాలని బీసీ కులాల లెక్కన 9 మందికి చోటు కల్పించాలని కోరారు.యాదవులు ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న రెండో విడత గొర్రెల పంపిణీని వెంటనే చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం మేకల కృష్ణ యాదవ్ మాట్లాడుతూ.. చరిత్రలో యాదవులు లేకుండా మంత్రి మండలి లేదని,యాదవ మంత్రి లేకుండా పాలన చేస్తున్న ఏకైక సీఎం రేవంత్ రెడ్డి అని ఎద్దేవా చేశారు.యాదవులను మరిచిపోతే కచ్చితంగా తగిన మూల్యం చెల్లిస్తారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మా సత్తా చాటుతామని హెచ్చరించారు. కొమ్మనబోయిన వేణు యాదవ్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు మొదటి అడుగు వేసి ఓట్లు వేసింది యాదవ జాతి బిడ్డలేనని గుర్తు చేశారు.యాదవులకు మంత్రి పదవి ఇవ్వకపోవడంలో కాంగ్రెస్ ఉద్దేశం చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గోవర్ధన్ యాదవ్,మేకల కృష్ణ యాదవ్, సిద్దిరాజు యాదవ్, ఆబోతు రాజు యాదవ్,కొమ్మనబోయిన వేణు యాదవ్,ఆబోతు అశోక్ యాదవ్, గజ్జి కొమురెల్లి యాదవ్, లింగన్న యాదవ్ ఆబోతు రాజ్ కుమార్ యాదవ్,బూడిద ముఖేష్ యాదవ్, బండి పర్వతాలు యాదవ్,సతీష్ యాదవ్, రాజు యాదవ్, బీరం శ్రీకాంత్ యాదవ్, అక్షయ్ యాదవ్,తదితరులు పాల్గొన్నారు.

## ఎస్.ఆర్.ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బి. కామ్., రిటైల్ ఆపరేషన్స్ కొత్త కోర్సుకు అడ్మిషన్లు

**(పడకంటి శ్రీనివాస్, ప్రజాతీర్పు ప్రతినిధి, కరీంనగర్ జూన్ 18)**



కరీంనగర్ లోని ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ( అటా నమస్)లో 2025-26 విద్యా సంవత్సరం నుంచి బి. కామ్., రిటైల్ ఆపరేషన్స్ అనే కొత్త డిగ్రీ కోర్సు ను, 60 సీట్ల తో ప్రారంభించుటకు దోస్త్ రెండవ విడత లో అనుమతి లభించిందని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ తెలిపారు. ఆధునిక పోటీ ప్రపంచంలో రిటైల్ రంగానికి గల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, ఈ కోర్సు విద్యార్థులకు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను అందించేందుకు ఈ కోర్సు రూపొందించబడింది. ఈ కోర్సులో చేరేందుకు ఇంటర్మీడియట్ పూర్తి చేసిన ఏ గ్రూపు విద్యార్థులు అయిన అర్హులు. అభ్యర్థులు దోస్త్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. కళాశాలలో ఈ కొత్త కోర్సు ద్వారా విద్యార్థులకు రిటైల్ రంగం లో ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ , డా. కె. సురేందర్ రెడ్డి, కామర్స్ విభాగాధిపతి టి. రాజయ్య లు తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన అన్ని గ్రూపుల విద్యార్థులు మరియు ఒకేషనల్ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొవలనీ, ఇతర వివరాలకు 9866571441, 99598 38049, 8341858459 ఫోన్ ద్వారా గాని, కళాశాల దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్ ను గాని, సంప్రదించాలని ఒక ప్రకటన లో తెలిపారు.

## పెండ్యాలకు వయోవృద్ధులు పెన్షనర్ల సన్మానం

**(పడకంటి శ్రీనివాస్, ప్రజాతీర్పు ప్రతినిధి, కరీంనగర్ జూన్ 18)**



రక్త దాతలను ప్రోత్సహించి, సేకరించడంలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న విశ్రాంత తహసిల్దార్ కేశవరెడ్డిని విశ్రాంత ఉద్యోగుల సంఘం, వయోవృద్ధుల సంక్షేమ సంఘం, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. నగరంలోని వయవృద్ధుల డే కేర్ సెంటర్ లో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు విశ్రాంత ఉద్యోగులు మాట్లాడుతూ, పదవీ విరమణ అనంతరం నుంచి వివిధ స్వచ్ఛంద సంస్థల ద్వారా కేశవరెడ్డి ప్రజలకు అందిస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం శాలువాలు కప్పి, పూల మాలలు వేసి ఘనంగా సత్కరించారు.

## ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ లో పారమిత విద్యార్థులు ప్రతిభ

**(పడకంటి శ్రీనివాస్, ప్రజాతీర్పు ప్రతినిధి, కరీంనగర్ జూన్ 18)**



ఇటీవల జరిగిన ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ (ఐ.టి..ఓ)లో స్థానిక కొత్తపల్లి మండలం పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి పలు స్థానాలను కైవసం చేసుకున్నారు. గణితం లో కె. అగస్త్య విశ్రుత్ (9వ తరగతి) రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు సాధించి నగదు బహుమతి గెలుపొందారు. అదేవిధంగా జి. ఆరుష్ రెడ్డి (6వ తరగతి), సాయిరిశిత్ జె. (8 వ తరగతి) లు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి ప్రశంసా పత్రాలు, మెడల్ ఆఫ్ ఎక్సలెన్స్ సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాదరావు, డైరెక్టర్లు రశ్మిత, ప్రసూన, అనూకర్ రావు, రాకేష్, వి.యు.యం. ప్రసాద్, వినోద్ రావు, టి.యస్.వి. రమణ, హన్మంత రావు లు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ, కోఆర్డినేటర్లు రాము, నాగరాజు, గణిత ఉపాధ్యాయులు వీరలక్ష్మి , ప్రదీప్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

### గీట్ల ముకుంద రెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు

**(పడకంటి శ్రీనివాస్, ప్రజాతీర్పు ప్రతినిధి, కరీంనగర్ జూన్ 18)**



సిఐటియు అనుబంధ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం కామ్రేడ్ కవంపల్లి రవి అధ్యక్షతన ఈరోజు సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు గీట్ల ముకుంద రెడ్డి, తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగామ రాజమల్లు మాట్లాడుతూ శతాబ్ద కాలంగా భారత కార్మికవర్గం అనేక త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్స్ లుగా తీసుకొచ్చి వాటి అమలుకు కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్నదని, దీన్ని నిరశిస్తూ జులై 9 న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేయాలని జాతీయ కార్మిక సంఘాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు పిలుపునిచ్చాయన్నారు. కోడ్స్ అమలు జరిగితే కార్మిక సంఘాల ఏర్పాటు కష్టతరం అవుతుందని, కార్మికుల సమష్టి బేరసారాల శక్తి నిర్వీర్యం చేయబడుతుందన్నారు. ఉద్యోగ, ఉపాధి భద్రత కోల్పోతారు. కార్మిక శాఖ కూడా నిర్వీర్యం చేయబడుతుంది. అందుకని 4 లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలి. కనీస వేతనం రూ. 26000 ఇవ్వాలి. ఔట్ సోర్సింగ్ , ఫిక్స్డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్, అప్రెంటిస్, ట్రైనులు వంటి రూపాలతో వివిధ పథకాల కింద పని చేస్తున కార్మికులు ఎవరిని క్యాసువలైజ్ చేయరాదు. కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి. కనీస పెన్షన్ 9000 ఇవ్వాలని, సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. బోనస్, ప్రావిడెంట్ ఫండ్ చెల్లింపు, అర్హత పై సీలింగ్ లను తొలగించాలన్నారు. విద్యుత్ సవరణ బిల్లు రద్దు చేయాలి. ప్రభుత్వ రంగ సంస్థలను, రైల్వే, విమాన సేవలు, బ్యాంక్స్, ఇన్సూరెన్సు, బొగ్గు గనులు ప్రైవేటీకరణ విరమించుకోవాలని అన్నారు. పని హక్కు ప్రాథమిక హక్కుగా గుర్తించాలి. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి. ఉచిత విద్య వైద్యం, నీరు మరియు అందరికీ పారిశుధ్యం అందుబాటులోకి తేవాలి. అందరికీ గృహ నిర్మాణ వసతి కల్పించడం తదితర అంశాలపై ఈ సమ్మె నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా నాయకులు ఎర్రోళ్ల రాజయ్య, ముక్కెర బుజ్జమ్మ, కత్తెరపాక లత, జేరిపోతుల మల్లేశం, జంగం రవీందర్, రాజేందర్, రవి, తిరుపతి, నరేందర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



## పట్టణంలో ఇటీవల మృతి చెందిన బిఆర్ఎస్ పార్టీ కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

**నర్సంపేట జూన్ 18( ప్రజా తీర్పు)**

నర్సంపేట పట్టణంలో ఇటీవల మృతి చెందిన బిఆర్ఎస్ పార్టీ కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పట్టణంలోని 8 వార్డు స్థానికులు వేల్పుల సాంబయ్య ఇటీవల మృతి చెందాగా వారి చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అనంతరం వారి కుటుంబ సభ్యులను కుమారుడు వేల్పుల శ్రీధర్ కుటుంబ బాగోగులను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని శాంతినగర్ 7వ వార్డు స్థానికులు గద్దల కొమురయ్య చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు వారి కుటుంబ సభ్యులు ముగ్గురు కుమారులను పరామర్శించినారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ గౌడ్ పట్టణ ప్రచార కార్యదర్శి,మాజీ కౌన్సిలర్స్ మండల శ్రీనివాస్, బండి ప్రవీణ్,పెండెం వెంకటేశ్వర్లు,గందె చంద్రమౌళి, ఆకుల ప్రభాకర్,జన్ను సురేందర్,కందికొండ శ్రీను,బగ్గీ రాజు,రాజేందర్ స్థానికులు తదితరులు పాల్గొన్నారు..



## రవికుమార్ యాదవ్ చొరవతో మదీనాగూడ ప్రభుత్వ పాఠశాలకు మహర్దశ..

### బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు బోయిని మహేష్ యాదవ్

**శేరిలింగంపల్లి, ప్రజాతీర్పు**

ఇటీవల కురిసిన భారీ వర్షం కారణంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని మదీనాగూడ ప్రభుత్వ పాఠశాలలో వరద నీరు చేరడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు బోయిని మహేష్ యాదవ్ స్థానిక నాయకులతో కలసి పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు సహా ఉపాధ్యాయుల గోడును గమనించిన మహేష్ యాదవ్ వెంటనే విషయాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జ్ రవి కుమార్ యాదవ్ సహా చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వరరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనితో పూర్వాపరాలు తెలుసుకున్న వారు సానుకూలంగా స్పందించి వారి లెటర్ హెడ్ ద్వారా రంగారెడ్డి జిల్లా డిఈఓ కి సమస్యలను వివరించి పాత పాఠశాలను తొలగించి ఒక్క సాఫ్ట్ వెర్ కంపెనీ వర్తుస కార్పొరేషన్ ద్వారా నూతన భావన, తరగతి గదులను పునర్నిర్మాణం చేసి ఆలాగే అప్ గ్రేడింగ్ 10వ తరగతి వరకు పెంచడంతో పేద మధ్య తరగతి ప్రజలకు లబ్ది జరుగుతుందని డిఈఓ కి లెటర్ ద్వారా వివరించడంతో వారు వెంటనే స్పందించి పాఠశాల పునర్నిర్మాణం కోసం విద్యాశాఖ అధికారి పూర్ణచంద్రరావు చేతుల మీదగా ఎన్ఓసి పర్మిషన్ లెటర్ ను బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు బోయిని మహేష్ యాదవ్ కి అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రమణయ్య ,సురేష్ కురుమ , సత్యనారాయణ, కుమార్ ,శివ ముదిరాజ్ మరియు తదితరులు పాల్గొన్నారు.



## జీరో టిల్లజీ మక్కా1 క్షేత్ర దినోత్సవం పురుగు మందుల ఉచిత పంపిణీ

**ప్రజాతీర్పు ప్రతినిధి, రామడుగు జూన్ 18**

కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని దేశరాజపల్లి గ్రామంలోని రైతు వేదికలో జీరో టిల్లజీ కరీంనగర్ మక్కా1 క్షేత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని వ్యవసాయ పరిశోధన స్థానం, కరీంనగర్ నిర్వహణలో, అఖిల భారత మొక్కజొన్న సమన్వయ పరిశోధన కేంద్రం సౌజన్యంతో, జాతీయ ఆహార భద్రత మిషన్ ఆర్థిక సహకారంతో జరిగింది. ఈ సందర్భంగా 125 మంది రైతులకు ఉచితంగా జింక్ సల్ఫేట్ (206 గ్రాములు) మరియు దెలిగేట్ పురుగు మందు (100 మిల్లీలీటర్లు) పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డా. జి. ఉషారాణి పాల్గొని, మొక్కజొన్న రకాలు, సాగు విధానాలు, శాస్త్రీయ సలహాలు తెలిపారు. వానాకాలం సాగు కోసం ముందుగానే రైతులు సన్నద్ధం కావాల్సిన అవసరముందని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి సూచించారు. జిల్లా హార్టికల్చర్ అధికారి ఆర్. శ్రీనివాస్ రావు పంట మార్పిడి మరియు మిక్కజొన్నతో పాటు ఇతర తక్కువ నీటి వనరులతో సాగు చేయదగిన పంటలపై వివరించారు. శాస్త్రవేత్త డా. పి. మధుకర్ రావు మొక్కజొన్న సాగు పద్ధతులపై రైతులకు ప్రాముఖ్యత కలిగిన సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి త్రివేధిక, వ్యవసాయ విస్తరణ అధికారి రమేష్, సంపత్, సుమారు 130 మంది రైతులు పాల్గొన్నారు.

## సిద్దిపేట ట్రాఫిక్ పోలీసుల వాహన తనిఖీలలో మద్యం సేవించి వాహానాలు నడిపిన 06 మందికి రూ.11 వేల జరిమానా

### సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్,

**సిద్దిపేట జిల్లా, (జూన్)ప్రజా తీర్పు ప్రతినిధి,,,**

గత కొన్ని రోజుల క్రితం సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తా, చౌరస్తాలలో మరియు రాజీవ్ రహదారిపై వాహానాలు తనిఖీ చేయగా, 06 మంది వ్యక్తులు మద్యం సేవించి వాహానాలు నడుపుతుండగా పట్టుకొని బ్రీత్ ఎనలైజర్ తో తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నారని రిపోర్టు రాగా ఈరోజు సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు, న్యాయమూర్తి గారి ముందు హాజరుపరచగా విచారణ చేసి 06 మందికి ? 11,000/-వేల రూపాయల జరిమాన విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ ప్రవీణ్ కుమార్, మాట్లాడుతూ మద్యం సేవించి వాహానాలు నడవదని, మరియు రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించే వాహానాలు నడపాలని, రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మాత్రమే ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు.



## కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌస్ ఆలం సమక్షంలో గంజాయి దగ్ధం...

( శరత్ రావు - కరీంనగర్, జూన్ 18 )

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల్లో స్వాధీనం చేసుకున్న 133.8 కిలోల గంజాయిని ధ్వంసం చేసినట్లు కరీంనగర్ పోలీస్ కమీషనర్ శ్రీ గౌస్ ఆలం ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు.

మానకొండూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈదులగట్టెపల్లి గ్రామంలో ఉన్న వెంకటరమణ ఇన్సినేటర్‌లో పోలీస్ కమీషనర్ గారి సమక్షంలో డ్రగ్ డిస్పోసల్ కమిటీ ఆధ్వర్యంలో ఈ గంజాయిని దహనం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు వేణుగోపాల్, విజయ్ కుమార్, ఇన్స్పెక్టర్లు పుల్లయ్య, సంజీవ్, రజినీకాంత్, అలాగే ఇన్సినరేటర్ ప్లాంట్ కు చెందిన తిరుపతి మరియు ప్రభాకర్ రెడ్డిలతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## భూ సమస్యల పై వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కారానికి కృషి చెయ్యాలి

**జిల్లా కలెక్టర్ కె. హైమావతి,,**

**సిద్దిపేట జిల్లా (జూన్)ప్రజా తీర్పు ప్రతినిధి,**

బుదవారం సిద్దిపేట అర్బన్ మండలంలోని తడకపల్లి గ్రామపంచాయతీలో నూతన అర్ ఓ అర్ చట్టం - భూ భారతి రెవెన్యూ అవగాహన సదస్సులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను త్వరగా ఫీల్డ్ విచారణ పూర్తి చేసే పరిష్కరించాలని అన్నారు. వచ్చిన దరఖాస్తులలో విచారణ పూర్తయిన వాటిని వెంటనే ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన ప్రతి దరఖాస్తుకు వాటి పూర్తి వివరాలు తీసుకోవాలని, భూ భారతి చట్ట ప్రకారం వాటి పరిష్కారానికి పకడ్బందీ చర్యలు చేపట్టాలని అన్నారు. రెవెన్యూ గ్రామంలో రైతులు, వ్యవసాయ భూమి, ప్రభుత్వ భూమి తదితర భూమి పూర్తి వివరాలతో విలేజ్ ప్రొఫైల్ తయారు చేయాలని తహసీల్దార్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ హరికిరణ్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## శారద నగర్ లో కార్పొరేటర్ పూజిత జగదీశ్వర్ గౌడ్ పర్యటన..

**శేరిలింగంపల్లి, ప్రజాతీర్పు**

హఫీజ్ పెట్ డివిజన్ పరిధిలోని శారద నగర్ కాలనీ(గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ) లో హఫీజ్ పెట్ డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి పూజిత జగదీశ్వర్ గౌడ్ తో కలిసి పర్యటించారు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్,గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు వి జగదీశ్వర్ గౌడ్.ఈ సందర్భంగా కాలనీ అభివృద్ధికి ఎంతగానో సహకరించిన స్థానిక కార్పొరేటర్లను నూతన కార్యవర్గం సభ్యులు సన్మానించారు అనంతరం నూతనంగా ఎన్నికైన కాలనీ అసోసియేషన్ సభ్యులు కార్పొరేటర్ మరియు నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీమతి శ్రీ వి పూజిత జగదీశ్వర్ గౌడ్ ఘనంగా సన్మానించారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలో చేపటాల్సిన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు,కాలనీ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ముందుకు సాగుతోందని,తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలింగ్ యాదగిరి గౌడ్,కనకమామిడి నరేందర్ గౌడ్ ,కాలనీ అధ్యక్షులు త్రినాథ్,కాలనీ సభ్యులు రవి కిరణ్,శ్రీనివాస్,రంగ రావు,వినయ్,శ్రీదేవి,శారద తదితరులు పాల్గొన్నారు..

## రైతులకు బాసటగా రైతు భరోసా

- వానాకాలం ప్రారంభానికి ముందే రూ.112.86 కోట్ల నిధుల జమ
- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,జూన్18(ప్రజాతీర్పు):**

వానాకాలం సీజన్‌కు ముందే రైతుల ఖాతాల్లోకి నిధులు జమ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం, రైతులకు బాసటగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. వ్యవసాయాన్ని పండుగలా మార్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. వానాకాలం%-%2025 సీజన్‌కు సంబంధించి నిర్మల్ జిల్లాలో మొత్తం రైతులు 1,86,400 గాను మంగళవారం నాటికీ డిబిటి ద్వారా విజయవంతంగా 1,33,135 మంది రైతులకు రూ.112.86 కోట్లు నిధులు నేరుగా రైతుల ఖాతాలో చేరినట్లు వివరించారు. రైతుల బ్యాంకు ఖాతాల వివరాలు రైతు భరోసా పోర్టల్‌లో నమోదు చేసినట్లు, మిగిలిన రైతుల ఖాతాల్లోనూ త్వరలోనే నిధులు జమ కాబోతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్ని ఎకరాలున్నా అన్ని ఎకరాలకు తగిన పెట్టుబడి సాయం అందేలా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టినట్లు వివరించారు. పెట్టుబడి భారం తగ్గించడమే కాకుండా, వ్యవసాయ ఉత్పాదకత పెంపుకు ఈ పథకం ప్రభావవంతంగా ఉపయోగపడుతోందని చెప్పారు. వానాకాలం సాగు ప్రారంభానికి ముందే నిధులు విడుదల కావడంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు.

# కాసిపేట 1 గనిలో కార్మికుల తీవ్ర ఇబ్బందులు గని మేనేజర్ శంకరయ్య కు వినతి పత్రం అందజేత

**మంచిర్యాల జిల్లా ప్రజా తీర్పు ప్రతినిధి వి వెంకటేష్ జూన్ 18**



మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియా కాసిపేట1వ గనిలో పనిచేస్తున్న కార్మికులను యాజమాన్యం తీవ్రంగా ఇబ్బంది పెడుతుందని పని స్థలాలలో కార్మికులపై ఒత్తిడి పెంచుతుందని కార్మికులు ఇబ్బంది పడుతూ బుధవారం రోజున గని మేనేజర్ భూ శంకరయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ కార్మికులకు పూర్తిగా స్వేచ్ఛ లేకుండా పోతుందని అండర్ గ్రౌండ్ లో పనిచేసిన కార్మికులకు రక్షణ కరువైపోయిందని అండర్ గ్రౌండ్ లో పనిచేసే కార్మికులకు గాలి సరిగా రావటం లేదని దాని తో కార్మికులు ఊపిరి తీసుకోడానికి ఇబ్బంది పడుతున్నారని ఆవేదనను వ్యక్తం చేసారు.. ట్రావెలింగ్ రోడ్లు సరిగా లేవు వాటిని యాజమాన్యం పట్టించుకోవడంలేదని పనిచేసే వారికి ఇన్ ఫేసులకి దగ్గరగా తగిన సామాను అందుబాటులో ఉండడం లేదని లైన్మెన్లు గాని సపోర్ట్ మాన్ గాని సామాను అందుబాటులో లేక దూరం ఉండడం వల్ల కార్మికులకు అవస్థకు గురవడం జరుగుతుంది అని కోల్ కట్టర్లకు సర్ఫేస్ నుండి మొదలుపెడితే మ్యాగ్జిన్ కు వెళ్లి మందు డబ్బా తీసుకువచ్చే క్రమంలో దానికి లాక్ సిస్టం లేకపోవడం ఫేస్ లో ఉల్లు కోసే రాడు నాణ్యత లేకపోవడం, బిట్ల నాణ్యత లేకపోవడం, బిట్లు సరిగా పట్టకపోవడం, ఇబ్బందికరంగా మారింది ఇంకా కాసిపేట 1%గా% మైన్ గురించి అయితే చెప్పనవసరం లేదు. ట్రావెలింగ్ నడక దూరంగా ఉండడం మరియు ఆ ట్రావెలింగ్ రోడ్డు గుంతలు గుంతలు గా ఉండడం గాలి మాత్రం నామమాత్రంగా ఉండడం, ఫేసులో కార్మికులకు అసలు గాలి అందకపోవడం. కోల్ కట్టర్లు ఉల్లు కోసే సమయంలో ఫేస్ లో నుండి నీళ్లు కూడా తొలగించకుండా బురదను కూడా తొలగించకుండా అదే నీళ్లలో బురదలో కట్టర్లతో పని చేయించడం, పనికి తగిన పనిముట్లు లేకపోవడం కార్మికుడు అలసిపోయి నీళ్లు తాగుదామని వెళితే పంపు అందుబాటులో ఉండకపోవడం పంపు ఉన్న అందులో నీరు రాకపోవడం వర్కింగ్ పేస్ లలో గాలి సరిగా లేక అండర్ గ్రౌండ్ లో చెమటలతో తడిసిపోతున్న కూడా యజమాన్యం లెక్కచేయడం లేదు.. నడక దూరం ఉన్నా కూడా నడిచి నడిచి కాళ్ళు అరిగిపోతున్నాయి, కాళ్ళ కీల్లు అరిగిపోయి అవస్థకు గురి అవుతున్నారు. మోకాళ్ళ నొప్పులు వస్తున్నాయి అండర్ గ్రౌండ్ లో అలసిపోయి వచ్చిన కార్మికులు రెస్టు తీసుకుందామంటే రెస్ట్ హాల్ కూడా లేకపోవడం చాలా ఇబ్బందికరంగా మారింది. ఈ వర్షాకాలం సమయంలో ఎక్కడో ఒక దగ్గర కూర్చుందాం అని వెళ్తే విషపూరితమైన పాములు, విషపూరితమైన తేళ్లు తిరగడం జరుగుతుంది. కార్మికులు రెస్టు తీసుకునే విధంగా వెంటనే రెస్ట్ హాల్ నిర్వహించాలి ఫేస్ లో పనిచేస్తున్నప్పుడు కోల్ కట్టర్ కార్మికులు ఫేస్ లో నీళ్లు బురద ఉంది అని తీపిస్తే ఉలు కోస్తామని అధికారులకు చెప్తే వాళ్ళు పట్టించుకోకుండా మేము చెప్పినట్లు పనిచేయాలి లేదంటే సస్పెండ్ చేస్తాం, చార్జి షీట్ ఇస్తాం అని బెదిరించడం జరుగుతుంది. ఏదైనా సమస్య ఉంది అని చెప్పుకుందామని అధికారులకు చెప్తే వాళ్లు చెప్పినట్లు చేయాలి అని కార్మికులను బెదిరించి పనులు చేపించడం జరుగుతుంది. కార్మికులను ఇలా వేధించడం ఎంతవరకు న్యాయం ఇలాంటి సంస్కృతిని వెంటనే నిషేధించాలి ఇలా చెప్పుకుంటూ పోతే కాసిపేట 1 గనిలో చీమల పుట్ట లాగా ఎన్నో సమస్యలు ఎదుర్కోవడం జరుగుతుంది పట్టించుకునే నాధుడే లేకుండా పోయింది. ఇన్ని సమస్యలు ఉన్నా కూడా కార్మికులు ప్రొడక్షన్ రావాలి, బొగ్గు తీసే క్రమంలో ఎలాంటి ఆటంకాలు రాకూడదని వారి యొక్క చెమట చుక్కలని ధారపోస్తూ పనిచేస్తున్న కాసిపేట 1 గని యాజమాన్యం కార్మికులని లెక్కచేయడం లేదు, కనికరం లేకుండా జాలి, దయ అనేది లేకుండా ఇబ్బంది పెట్టడం జరుగుతుంది యాజమాన్యం వెంటనే ఈ సమస్యల పైన దృష్టి పెట్టి అలాగే ఇంకా ఎన్నో సమస్యలు ఉన్నాయి వాటిపైన తక్షణమే చర్యలు తీసుకొని కార్మికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని కార్మికులు మేనేజర్ కు వినతి పత్రం అందజేసి సమస్యలను వెంటనే తీర్చాలని కోరుకున్నారు

## బెల్లంపల్లి పట్టణం లో ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

- ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనల పైన అవగాహన కలిగి ఉండాలి.
- బెల్లంపల్లి 2 టౌన్ ఎస్ఐ మహేందర్

**మంచిర్యాల జిల్లా ప్రజా తీర్పు ప్రతినిధి వి వెంకటేష్ జూన్ 18**



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగి ఉండాలని బెల్లంపల్లి 2 టౌన్ పోలీసులు ఈరోజు కాల్ టెక్స్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీద కృష్ణవేణి ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ట్రాఫిక్ నియమాలపై ఒక అవగాహన కార్యక్రమాన్ని,విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ పోలీసులు నిర్వర్తించే విధులను విద్యార్థులకు వివరించడమే కాకుండా, వారితో కలిసి ట్రాఫిక్ నియంత్రణను నిర్వహించారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు, హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలు, మరియు మైనర్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల కలిగే నష్టాలు వంటి కీలక అంశాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా ట్రాఫిక్ నియంత్రణ మరియు రోడ్డు భద్రత పై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించే విధంగా వినూత్న ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి 2 టౌన్ ఏఎస్ఐ తిరుపతి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఆటో నుండి పడి విద్యార్థి రిహాన్ 6.సం మృతి

**మంచిర్యాల జిల్లా ప్రజా తీర్పు ప్రతినిధి వి వెంకటేష్ జూన్ 18**

ఆటోల నుండి పడి విద్యార్థి రిహాన్ (6) మృతి వివరాల్లోకి వెళ్తే మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణం బాపూక్యాంపు లోని ఎడ్ కేర్ పాఠశాలలో 1వ తరగతి చదువుతున్న రిహాన్ ( 6 ) స్కూల్ నుండి ఆటోలో ఇంటికి వెళ్తున్నా సమయంలో సుభాష్ నగర్ వెంకటేశ్వర స్వామి దేవాలయం సమీపంలో పంది ఆటో కు అడ్డం రావడంతో పందిని తప్పించబోయి ఆటో కట్ చేయడంతో ఆటోలో కూర్చున్న రిహాన్ కింద పడిపోయి తలకు తీవ్ర గాయాలయ్యాయి, తీవ్ర రక్తస్రావం అవుతున్న రిహాన్ ను బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు, ఆసుపత్రి లో పరిశీలించిన వైద్యులు అప్పటికె రిహాన్ మృతి చెందినట్లు డాక్టర్ తెలిపారు. పట్టణంలోని సుభాష్ నగర్ కు చెందిన కలుగుర సంతోష్ జ్యోతి లకు ఇద్దరు సంతానం రిహాన్ పెద్దవాడు, కూతురు సమన్వి కుమారుడు రిహాన్,మృతి చెందడం తొ ఆసుపత్రి లో తల్లిదండ్రులు కన్నీటి రోదనలు అందరిని కలచివేశాయి బెల్లంపల్లి 2టౌన్ ఎస్సై మహేందర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు... ఆసుపత్రికి చేరుకున్న విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ యాజమాన్యాలు ఫిట్నెస్ లేని వెహికల్లను ప్రొవైడ్ చేస్తూ విద్యార్థులకు బస్సు కంటే తక్కువ రాయితీలో ఈ వెహికల్స్ ను అందజేస్తున్నామని పేరెంట్స్ ను నమ్మ పలుకుతూ ఫిట్నెస్ లేని వాహనాలను కనీసం డ్రైవింగ్ లైసెన్స్ లేని డ్రైవర్లతో అధిక సంఖ్యలో వాహనాలలో విద్యార్థులను తరలిస్తూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు ఇదే సంఘటన ఈరోజు బెల్లంపల్లి పట్టణంలో ఎడ్యుకేర్ పాఠశాలలో జరిగింది దీనికి పూర్తి బాధ్యత యాజమాన్యమే భరించుతూ కుటుంబానికి న్యాయం చేయాలని ఎడ్ కేర్ పాఠశాల పై క్రిమినల్ కేసులు నమోదు చేసి వారిపై చర్యలు తీసుకోవాలని ఉన్నదికారులను డిమాండ్ చేశారు

## రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బోయిని నిర్మల జయరాజు**

**( ప్రజాతీర్పు ప్రతినిధి కోహెడ జూన్ 18)**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని కోహెడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బోయిని నిర్మల జయరాజు అన్నారు. బుధవారం కోహెడ మండలం మైసంపల్లి ఎర్రగుంట పల్లి గ్రామాల్లో తహసీల్దార్ సమీర్ అహ్మద్ ఖాన్, డిప్యూటీ తహసీల్దార్ దేవేంద్ర ఆధ్వర్యంలో భూ భారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు కళ్ళలో సంతోషం చూడాలి అని రైతుకు న్యాయం చేయడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని ఆమె అన్నారు. రైతుకు గత ప్రభుత్వం ధరణి ద్వారా అన్యాయం చేసిందని ఇప్పుడు ప్రజా ప్రభుత్వం రైతుల కోసం పనిచేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. భూ సమస్యలు ఉన్న రైతులు భూ భారతి ద్వారా అన్ని సమస్యలు పరిష్కరించుకోవచ్చు అని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భీమ్ రెడ్డి తిరుపతి రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దూలం శ్రీనివాస్, ఆర్ఐ ఎల్లయ్య, మాజీ సర్పంచ్ శెట్టి సుధాకర్, బోయిని జయరాజ్ నాయకులు పోలోజు సుదర్శన్, సంగం కిషన్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు కాంతాల శివా రెడ్డి, ఉపాధ్యక్షులు ఆవుల మహేందర్, మైసంపల్లి అధ్యక్షులు ఇట్టబోయిన తిరుపతి, భైరి శ్రీనివాస్, జెరిపోతుల శ్రీనివాస్, మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లి మెడలో గొలుసు దొంగిలించిన కొడుకు చాకచక్యంగా కేసును ఛేదించిన మందమర్రి పోలీసులు



మంచిర్యాల జిల్లా మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని స్టేషన్ రోడ్‌లో మే నెల 24 వ తేదీన జరిగిన చైన్ స్నాచింగ్ కేసును పోలీసులు ఛేదించారు. కన్నతల్లి మెడలోని బంగారు గొలుసును దొంగిలించి, గుర్తుతెలియని వ్యక్తులపై నెపం మోపిన కొడుకునే నిందితుడిగా తేల్చిన మందమరి పోలీసులు మందమర్రి రైల్వే స్టేషన్ రోడ్‌లో నివాసముంటున్న విజయపురి పుల్లమ్మ (76) అనే వృద్ధురాలు, అనారోగ్యంతో బాధపడుతూ మంచంలో ఉన్న సమయంలో, తేది. 24.05.2025 రాత్రి సుమారు 7 గంటల ప్రాంతంలో ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించాడని ఆమె మనవడు శివ పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న మందమర్రి పోలీసులు, ఇన్‌స్పెక్టర్ శశిధర్ రెడ్డి మరియు ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించారు. ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ, తమ సాంకేతిక మరియు మానవ వనరుల పరిజ్ఞానంతో దర్యాప్తు చేపట్టగా, బయటి వ్యక్తులు ఈ నేరం చేసి ఉండరని పోలీసులు అనుమానించారు. ఈ క్రమంలో, వృద్ధురాలి కొడుకైన విజయపురి శంకరయ్య (65) ప్రవర్తన పై అనుమానం రావడంతో, అతన్ని తమదైన శైలిలో విచారించారు. విచారణలో శంకరయ్య తన నేరాన్ని అంగీకరించాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా తానే తన తల్లి మెడలోని బంగారు గొలుసును దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. దొంగతనాన్ని కప్పిపుచ్చుకోవడానికి గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఈ దొంగతనానికి పాల్పడ్డారని అందరినీ నమ్మించే ప్రయత్నం చేశానని తెలిపాడు. నిందితుడి నుంచి చోరీ సొత్తయిన రెండు తులాల బంగారు గొలుసును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తర్వాత నిందితుడిని రిమాండ్ కు తరలించినట్లు బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ తెలిపారు.ఈ కేసును అత్యంత చాకచక్యంగా, ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన మందమర్రి ఇన్‌స్పెక్టర్ శశిధర్ రెడ్డి, ఎస్సై రాజశేఖర్, మరియు క్రైమ్ టీం కానిస్టేబుళ్లు మహేష్, రాకేష్‌లను రామగుండం పోలీస్ కమిషనర్ , మంచిర్యాల డిసిపి ,బెల్లంపల్లి ఏసిపి ప్రత్యేకంగా అభినందించారు.



## ప్రజల కళ్లలో మసిపూసే చర్య!

**(మహేశ్వరం నియోజకవర్గం ప్రజా తీర్పు పత్రిక రిపోర్టర్ వై యాదగిరి)... తేదీ18/6/2025/**

జల్ పల్లి మున్సిపాలిటీ పహాడీ షరీఫ్ ప్రాంతంలో వీరాంజనేయ స్వామి దేవాలయ స్థలాన్ని కబ్జా చేసిన విషయాన్ని నిన్న అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వెంటనే అర్థం లేని జాగ్రత్త చర్యలతో కాంగ్రెస్ నేత పేరు ఉన్న ఫ్లెక్సీలను మాత్రమే తీసివేశారు. ఇది ప్రజల కళ్లలో మసిపూసే చర్య! పేర్లు, ఫ్లెక్సీలు తీయడం కాదు ు అసలు సమస్య ఏమిటంటే శతాబ్దాల పాత దేవాలయ స్థలాన్ని అక్రమంగా కబ్జా చేసి నిర్మించిన భవనాలు. ఇవి పూర్తి స్థాయిలో కూల్చివేయాలి. ఇది దేవస్థానంపై చేసిన దాడి. ఇది మత విశ్వాసాలపై చేసిన అఘాయిత్యమయం. వీరాంజనేయ స్వామి దేవాలయం స్థలాన్ని స్వాధీనం చేసుకొని, అక్కడ ఏర్పాటుచేసిన ప్రతి అక్రమ నిర్మాణాన్ని నాశనం చేయకుంటే... ఇది హిందూ సమాజాన్ని నెగ్గదీసే కుట్రగా పరిగణించాలి. ప్రభుత్వం, అధికారులు తక్షణమే కదలిక చూపించాలి. లేకపోతే ప్రజల ఆగ్రహం తారాస్థాయికి చేరుతుంది. హిందూ దేవాలయాలపై జరిగిన ఈ దుర్మార్గాన్ని సహించేది లేదు! మహేశ్వరం నియోజకవర్గ బిజెపి నాయకులు హెచ్చరించారు.



## మీర్పేట్ ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**(మహేశ్వరం నియోజకవర్గం ప్రజా తీర్పు పత్రిక రిపోర్టర్ వై యాదగిరి)...**

మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ పాఠశాల మరియు జూనియర్ కళాశాలను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి గారు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సాన్నిహితంగా మాట్లాడిన ఎమ్మెల్యే గారు, వారి అభిప్రాయాలు, అవసరాలు తెలుసుకున్నారు. విద్యా ప్రమాణాలపై ఆసక్తి చూపుతూ, ఉపాధ్యాయులతో కలిసి శిక్షణా విధానాలపై సమీక్ష నిర్వహించారు.పిల్లలతో కలిసి ఓ హర్షాతిరేక వాతావరణాన్ని సృష్టించిన ఎమ్మెల్యే గారు, వారందరికీ స్వీట్లు పంపిణీ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్శనలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఏక్ పేడ్ మాకే నామ్ జిల్లా ఇన్చార్జీగా సోమారపు లావణ్య

**సుల్తానాబాద్, ప్రజాతీర్పు రిపోర్టర్**

గతేడాది భారత ప్రధాని నరేంద్రమోదీ ప్రతిష్టాత్మకంగా రూపొందించిన ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమ పెద్దపల్లి జిల్లా ఇన్చార్జిగా సోమారపు లావణ్య నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్రపార్టీ నియామక ఉత్తర్వులు బుధవారం ఇచ్చింది. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలంతా మొక్కలునాటి, చెట్లు పెంచేలా ప్రోత్సహించేందుకు అమ్మ పేరుతో ఒక మొక్క పేరిట ప్రత్యేక రూపొందించినట్లు లావణ్య తెలిపారు. మొక్కలు నాటడం వల్ల కృతజ్ఞతగా మనకు వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి, కాలుష్యాన్ని తగ్గించడానికి, మన పరిసరాలను పచ్చగా మార్చడానికి చెట్లు సాయపడుతయని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ ఒకమొక్క నాటేలా అవగాహన తీసుకొస్తానని లావణ్య స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కొరకు కార్యకర్తలు, నాయకులు సహకరించాలని కోరారు. మొక్కలు నాటే దృశ్యాలను సోషల్ మీడియాలో పంచుకుని ప్రచారాన్ని ఉద్యమంగా మార్చాలని లావణ్య పిలుపునిచ్చారు. కాగా, తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకత్వానికి ధన్యవాదములు తెలిపారు.



## కమ్యూనిస్టులే నిజమైన దేశభక్తులు.

**ప్రజా తీర్పు మంచిర్యాల జిల్లా ప్రతినిధి దండే భూమన్న 18 జూన్ 2025**

మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం నీలయపల్లి భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నూతన గ్రామ కమిటీని ఎన్నుకోవడం జరిగినది అనంతరం సిపిఐ జిల్లా సమితి సభ్యులు . కొండు బానే ష్ మాట్లాడుతూ సిపిఐ100 సంవత్సరాలు సుదీర్ఘ పోరాటంలో అనేక ఉద్యమంలో పోరాటాలు కొనసాగించారని భూమి కోసం భుక్తి కోసం అనేక పోరాటాలు కొనసాగించాలని దేశ స్వాతంత్ర్యం కోసం అలుపెరుగని పోరాటాలు కొనసాగించారని ప్రత్యేక రాష్ట్రాలు విభజన కోసం పనిచేశారని ఆయన అన్నారు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మంచిర్యాల జిల్లా 4. వ మహాసభలను ఈనెల 21న బహిరంగ సభ 22న ప్రతినిధుల సభ ఉంటుందని అన్ని వర్గాల ప్రజలు మంచిర్యాల పట్టణానికి వచ్చి ఈ మహాసభలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. సిపిఐ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగినది. ఎడ్ల గోపాల్ గ్రామ కార్యదర్శిగా. ఊరడి లచ్చన్న సహాయ కార్యదర్శిగా. శ్రీనివాస్ కోశాధికారిగా కౌన్సిల్ సభ్యులుగా. బొంతల భూమయ్య. కోయ పోచన్న. మేడి గణేష్. ఊరడి రవి. విగ్నేష్. రాజేష్. రా మెల్ల లక్ష్మి గార్లను ఎన్నుకోవడం జరిగినది.

# ఫార్ములా రేసు పేరుతో కోట్లు తిన్న తెరాస నాయకులు

**వంద ఏండ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ కండువా మనది ఎవ్వరైనా నేతలు వచ్చినప్పుడు కేవలం కాంగ్రెస్ కండువాలు మాత్రమే కప్పాలి దేవాలయాల్లో కప్పే కండువాలు రాజకీయ వేదికపై పెట్టొద్దు.**

**టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం. మేడ్చల్ జిల్లా, ప్రజా తీర్పు :-**




బుధవారం గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం.ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ,ఫార్ములా ఈ- కార్ రేసులో అడ్డంగా బుక్కైన కేటీఆర్ ఇప్పుడు ఎన్నికేసులైనా పెట్టుకోండి. జైలుకైనా వెళ్లడానికి సిద్ధం అని సిగ్గు లేకుండా కేటిఆర్ అంటున్నారు.ఏసీబీ అడిగే ప్రశ్నలకు జవాబు చెప్పలేక నీళు నములుతున్నకేటీఆర్! ఫార్ములా రేసు పేరుతో కోట్లు దొబ్బినవ్. జైలుకు వెళ్లక తప్పదు.నువ్వు ఏమైనా స్వాతంత్ర్య సమరయోధుడివా కేటిఆర్? మీరు అవినీతి చేస్తే, కేసులు వస్తాయ్.ఇవి లొట్టపీసు కేసులు కావు.ఇప్పుడు బావ-బామ్మర్దులతో కలిసి లొట్టపీసు కేసులకు చుచ్చు పోసుకుంటున్నారు అని ధ్వజమెత్తారు. కేటిఆర్ పేరు ఇకపై లొట్టపీసు కేటిఆర్ గా పిలవాలి అన్నారు.ఫార్ములా ఈ కార్ రేస్ స్కాంలో నేను అడిగాకే అరవింద్ కుమార్ డబ్బులు ట్రాన్స్ఫర్ చేశారని కేటిఆర్ అంటున్నారు. విచారణకు వస్తే చుచ్చు పోసుకుంటున్నారు.ఏసిబి అధికారులకు సెల్‌ఫోన్లు ఇచ్చి నిజాయితీ నిరూపించుకోవాలి అన్నారు.దోచుకుని దబాయిస్తామంటే కుదరదు కేటీఆర్..కాంగ్రెస్ పార్టీ లేకుంటే మీకు పుట్టగతులే ఉండేవి కావు,కాంగ్రెస్ చేసిన మేలును మరిచారు. తెలంగాణ ప్రజల ధనాన్ని దోచుకున్న దొంగలు మీరు. రేవంత్ రెడ్డి పై వేసిన కేసులన్నీ ఆయన ఒక్కడే ఎదుర్కొన్నాడు.ఇప్పుడు సన్యాసి పరిపాలన సాగిస్తున్నది రేవంత్ రెడ్డి అని కేటీఆర్ వ్యాక్యాలు చేస్తున్నారు వాస్తవానికి అసలైన 'సన్యాసులు' కేసీఆర్, కేటిఆర్, హరీష్ రావులే అని అన్నారు.ఫోన్ ట్యాపింగ్ దుర్మార్గమైన చర్య, ఇతరుల హక్కులు హరించే ధైర్యం మీకు ఎవరు ఇచ్చారు? 15 రోజుల్లో 618 లీడర్ల ఫోన్లను ట్యాప్ చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం.! ఇది ప్రజాస్వామ్యమా..? ఇది గోప్యత హక్కుల మీద దాడికాదా.? కేటీఆర్ ఇలాంటి చిల్లర పనులు చేయాలని ఆలోచన ఎలా వచ్చింది మీకు? అధికారంలో ఉండగా మీరు చేసింది అభివృద్ధి కాదు. ఓటమిని భయపడి రాజకీయ కుట్రలు. తెలంగాణ సమాజం మీ దుర్బుద్ధిని ఎప్పటికీ క్షమించదు.ఇప్పటికే ప్రజలు బుద్ధి చెప్పేశారు.ఇంకెన్ని పాపాలు బయట పడతాయో చూడాలి అన్నారు.దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తుందని కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఎన్నోసార్లు చెప్పాడు కానీ అది అభివృద్ధి వైపు కాదు వీళ్ళు చేసిన అరాచకాల వైపు అని అని ఇప్పుడు అర్థమైంది. పదేళ్ల మీ అవినీతి, అరాచకాలు,దాడులు, దౌర్జన్యాలు,సెటిల్మెంట్లు ఒక ఎత్తైతే. పోలీస్ మాఫియా,ఫోన్ ట్యాపింగ్,బెదిరింపులు,అక్రమ కేసులు,బలవంతపు పార్టీ ఫండింగులు మరో ఎత్తు. అభివృద్ధిలో,ప్రజా సంపాదన సృష్టిలో ముందు వరసలో ఉండాల్సిన రాష్ట్రం ఈరోజు మీ వల్ల బజారులో నిలబడింది.నాటి రాచరిక వ్యవస్థలను తలదాన్నేలా కల్వకుంట్ల రాచరిక వ్యవస్థను ఏర్పాటు చేయడం మీ కుటుంబానికే సాధ్యమైంది.2023 ఎన్నికలకు ముందు దాదాపు 650 మంది సినీ,రాజకీయ, వ్యాపార ప్రముఖులు ఫోన్లు ట్యాప్ అయ్యాయి. ఫోన్లు ట్యాప్ చేసి ప్రతిపక్ష నేతలు మాత్రమే కాదు.సొంత పార్టీ మహిళల వ్యక్తిగత సంభాషణలు సైతం విన్నారు.అని అన్నారు.దేశ చరిత్రలో మునుపెన్నడూ లేని అధికార దుర్వినియోగానికి, కేసీఆర్ ఫ్యామిలీ పాల్పడినట్లుగా దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుంది అన్నారు. అలాగే కాంగ్రెస్ శ్రేణులు ఎవరైనా నేతలు మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు వచ్చినప్పుడు, కేవలం కాంగ్రెస్ కండువాలు మాత్రమే కప్పాలి అని, రామరాజు కాటన్, దేవాలయాల్లో కప్పే కండువాలు,రాజకీయ వేదికపై పెట్టొద్దు అని, మనది వందేళ్ల చరిత్ర ఉన్న కండువా దాన్ని మనం గౌరవించాలి అని,మనపై జరుగుతున్నవి రాజకీయ దాడులే,ప్రతి కార్యకర్త గుర్తుంచుకోవాలని కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## త్వరలో పట్టాలెక్కనున్న వందే భారత్ స్లీపర్ రైళ్లు.. ఎలా ఉందో చూశారంటే ఆగలేరు!




పూర్తి అందుబాటులోకి రాకమునుపే.. నిర్మాణంలో ఉన్న వందే భారత్ స్లీపర్ ట్రైన్‌కు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వీడియోలో ట్రైన్ లోపలి ఇంటీరియర్, బెడ్లు, సౌకర్యాలన్నీ ఆ వీడియోలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ రైళ్లో ప్రయాణించడం అంటే..హై-ఎండ్ హోటల్‌లో ఒకరాత్రి గడిపిన ఫీలింగ్ తప్పక కలుగుతుందని చెబుతున్నారు. రైలు ప్రయాణికులకు నిజంగానే ఇది గుడ్‌న్యూస్‌గా చెప్పాలి. ఎందుకంటే.. వచ్చే నెల నుండి వందే భారత్ స్లీపర్ రైళ్లు పట్టాలపై పరిగెత్తనున్నాయి. ఈ రైళ్లు రాత్రిపూట ప్రయాణాల కోసం ప్రత్యేకంగా రూపొందించబడ్డాయి. వేగవంతమైన ప్రయాణం, ఆధునిక సౌకర్యాలతోపాటు హాయిగా నిద్రపోయేందుకు అనుకూలంగా బెర్తులు అందుబాటులో ఉండున్నాయి. ప్రస్తుతం ఉన్న సీటింగ్ వందే భారత్ రైళ్లకు కొనసాగింపుగా ఇవి ప్రయాణికులకు సరికొత్త అనుభూతిని అందించనున్నట్టు రైల్వే వెల్లడించింది. వందేభారత్ స్లీపర్ కోచ్ రైలుకు సంబంధించిన వీడియో ఒకటి ఇప్పుడు ఇంటర్‌నెట్‌లో చక్కర్లు కొడుతోంది.పూర్తి అందుబాటులోకి రాకమునుపే.. నిర్మాణంలో ఉన్న వందే భారత్ స్లీపర్ ట్రైన్‌కు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వీడియోలో ట్రైన్ లోపలి ఇంటీరియర్, బెడ్లు, సౌకర్యాలన్నీ ఆ వీడియోలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ రైళ్లో ప్రయాణించడం అంటే..హై-ఎండ్ హోటల్‌లో ఒకరాత్రి గడిపిన ఫీలింగ్ తప్పక కలుగుతుందని చెబుతున్నారు.

## సరికొత్త యాప్ .. ఇక మీరే ఇంట్లోనే ఫోన్లో ఆధార్ అప్డేట్ చేసుకోవచ్చు..!




ఆధార్ కార్డు అప్‌డేట్ లు త్వరలోనే చాలా సులభం కాబోతున్నాయి. నవంబర్ నాటికి, ఒక కొత్త యాప్ ద్వారా మీరు ఇంటి నుంచే ఆధార్ వివరాల ను అప్‌డేట్ చేసుకోవచ్చు. పేరు, చిరునామా, పుట్టిన తేదీ వంటి వివరాలను మీరే మార్చుకోవచ్చు. ఆధార్ అనేది ఒక వ్యక్తి గుర్తింపును ప్రామాణీకరించే 12 అంకెల ప్రత్యేక %×ణ% నంబర్. ఇది ప్రభుత్వ పథకాలు, బ్యాంకింగ్ సౌకర్యాలను పొందటానికి చాలా ముఖ్యమైనదిగా మారింది. ప్రతి వ్యక్తి ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి వారి ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకోవడం అవసరం. పిల్లల కోసం జారీ చేయబడిన బాల్ ఆధార్‌ను 5 సంవత్సరాల వయస్సు, 15 సంవత్సరాల వయస్సు ముందు అప్‌డేట్ చేయాలి. అలాగే పేరు (కొన్ని షరతులతో), చిరునామా, పుట్టిన తేదీ, లింగం, ఇతర జనాభా వివరాలలో ఆన్‌లైన్‌లో మార్పులు చేయవచ్చు. కానీ మొబైల్ నంబర్, ఇమెయిల్ ఐడి, బయోమెట్రిక్ డేటా లేదా ఫోటోలో మార్పుల కోసం, మీరు సమీపంలోని ఆధార్ సేవా కేంద్రానికి వెళ్లి రూ. 50 రుసుముతో ప్రక్రియను పూర్తి చేయాలి. అయితే రాబోయే రోజుల్లో ఇంత ఇబ్బంది ఉండదు. మీరు కేవలం బయోమెట్రిక్స్, %×=×ూ% కోసం మాత్రమే సేవా కేంద్రానికి వెళ్లాలి. ఆధార్‌ను అప్‌డేట్ చేయడానికి మీరు యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (%ఖ×ణూ×%) కేంద్రానికి వెళ్లి, లైన్లో గంటల తరబడి నిలబడాల్సిన అవసరం లేదు. నవంబర్ నాటికి అందుబాటులోకి వచ్చేలా సరికొత్త యాప్‌ను అభివృద్ధి చేస్తున్నారు. దీంతో ఇంట్లో కూర్చొని ఆ యాప్ ద్వారా మీ ఆధార్‌లోని ప్రతిదాన్ని మీరే అప్‌డేట్ చేసుకోవచ్చు. భద్రత దృష్ట్యా, ఆధార్‌ను అప్‌డేట్ చేయడానికి మొబైల్ నంబర్‌కు వచ్చే %ూు% ఫీచర్ ఉంటుంది. రిజిస్ట్రేషన్ సమయంలో మీరు నంబర్‌ను నమోదు చేసుకోవడం తప్పనిసరి అవుతుంది. ఈ యంత్రాలను అథారిటీ డేటాబేస్‌కు అనుసంధానిస్తోంది. ఇప్పటివరకు దాదాపు రెండు వేల యంత్రాలు లింక్ చేయబడ్డాయి, ఇంకా 98 వేల యంత్రాలు లింక్ చేయాల్సి ఉంది. ఈ పని నవంబర్ ముందు పూర్తవుతుంది. యాప్ ప్రారంభించిన తర్వాత ఆధార్‌లో ఏదైనా మార్పు స్వయంగా చేసుకోవచ్చు. ఈ డేటాబేస్ జనన ధృవీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్, మొబైల్ నంబర్‌తో సహా అన్ని ఇతర ప్రామాణీకరించబడిన సమాచారానికి అనుసంధానించబడుతుంది. బయోమెట్రిక్స్, కంటి గుర్తింపు నమోదు చేయడానికి మాత్రమే ఆధార్ కేంద్రానికి వెళ్లాలి. ఇది కాకుండా ఇతర మార్పులు రిజిస్టర్డ్ వ్యక్తి స్వయంగా చేయవచ్చు.



## పొదుపుతో పదవీ విరమణ జీవితం హ్యాపీ.. ది బెస్ట్ స్కీమ్స్ ఇవే..!

నేటి పొదుపుతో భవిష్యత్‌లో మంచి రాబడి వస్తుందనే విషయం అందరికీ తెలిసిందే. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే చందాన సంపాదన ఉన్నప్పుడే కొంత మంది భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని పెట్టుబడి పెడుతూ ఉంటారు. అయితే పదవీ విరమణ సమయంలో పెద్ద మొత్తంలో వచ్చిన సొమ్మును పెట్టుబడి పెట్టడానికి ఏయే పథకాలు మంచివో నిపుణులు చెబుతున్నారు. సీనియర్ సిటిజన్ల కోసం ప్రభుత్వ మద్దతు ఉన్న అనేక పథకాలు కూడా ఉన్నాయి. ఈ పథకాల్లో పెట్టుబడితో సురక్షితమైన రాబడిని పొందవచ్చు. పదవీ విరమణ సంవత్సరాల్లో స్థిరమైన ఆదాయం కోసం, పెట్టుబడులను అనేక పథకాలలో వైవిధ్యపరచవచ్చు. ప్రస్తుతం భారతదేశంలో సీనియర్ సిటిజన్లు ఎంచుకోవడానికి, వారి భవిష్యత్తును భద్రపరచుకోవడానికి అనేక ఎంపికలు అందుబాటులో ఉన్నాయి. ఆ పథకాల గురించి మరిన్ని వివరాలను తెలుసుకుందాం

### సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీమ్

సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ అనేది ప్రభుత్వ మద్దతుతో కూడిన పొదుపు పథకం. ఇది సురక్షితమైన రాబడిని అందిస్తుంది. 2004లో ప్రవేశపెట్టిన ఈ పథకం 60 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న సీనియర్ సిటిజన్ల కోసం రూపొందించారు. ఇది పదవీ విరమణ తర్వాత ఆర్థిక భద్రతను అందిస్తుంది. 8.2 శాతం స్థిర వడ్డీ రేటుతో (జూన్ 12, 2025 నాటికి). 5 సంవత్సరాల కాలంలో రూ. 1,000 నుండి రూ. 30 లక్షల మధ్య పెట్టుబడి పెట్టవచ్చు, అయితే, మీరు దానిని మరో మూడు సంవత్సరాలు పొడిగించవచ్చు.

### జాతీయ పెన్షన్ సిస్టమ్

సీనియర్ సిటిజన్ల కోసం ప్రభుత్వం మద్దతు ఇచ్చే మరో పదవీ విరమణ పొదుపు పథకం నేషనల్ పెన్షన్ సిస్టమ్. ఇది పదవీ విరమణ తర్వాత వారి భవిష్యత్తును భద్రపరచడానికి ఆర్థిక భద్రత, క్రమబద్ధమైన ఆదాయాన్ని అందిస్తుంది. ఈ పథకంతో వ్యక్తులు ఈక్విటీ, కార్పొరేట్ బాండ్లు, ప్రభుత్వ సెక్యూరిటీల మిశ్రమంలో క్రమపద్ధతిలో పెట్టుబడి పెట్టవచ్చు. ఈ పథకం సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనాన్ని కూడా అందిస్తుంది. పదవీ విరమణ తర్వాత లేదా 60 సంవత్సరాలు దాటిన తర్వాత మీరు మొత్తం కార్పస్‌లో 60 శాతం వరకు ఉపసంహరించుకోవచ్చు. మిగిలిన 40% పెన్షన్ లేదా యాన్యుటీ ప్లాన్‌ల కోసం ఉపయోగించవచ్చు.

## సిమెంట్ గిరాకీ తగ్గొచ్చు.. డిమాండ్‌పై వర్షాల ప్రభావం

రుతుపవనాల కదలికలతో ఈసారి వర్షాకాలం ముందుగానే రావడం వల్ల మార్కెట్‌లో సిమెంట్ గిరాకీ ప్రభావితమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ ఇండియా రేటింగ్స్ చెప్తున్నది. గత ఆర్థిక సంవత్సరం (2024-25) సిమెంట్ డిమాండ్ దాదాపు 75 శాతానికి పరిమితమైందని, అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2023-24) ఇది 77 శాతంగా ఉన్నదని గుర్తుచేస్తున్నది. ఈ క్రమంలో వర్షాల ప్రభావంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) కూడా సిమెంట్ గిరాకీ సన్నగిల్లే వీలుందని అంటున్నది. మార్కెట్‌లోకి డిమాండ్‌కు మించి సిమెంట్ సరఫరా కావడంతో దేశంలోని దక్షిణాది రాష్ట్రాల్లో సిమెంట్ ధరలు కొంతమేర పడిపోయినట్టు వ్యాపార, పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి. తూర్పు రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉన్నట్టు తేలింది. సహజంగానే వర్షాలు పడితే నిర్మాణ పనులు ఆగిపోతాయి. ఇండ్లు, ఇతర ప్రాజెక్టులు నిలిచిపోతాయి. దీంతో వర్షాకాలంలో ఎప్పుడైనా సిమెంట్‌కు గిరాకీ తక్కువే. అయితే ఈ ఏడాది వర్షాకాలం ముందుగానే వచ్చింది. మే నెలలోనే చాలాచోట్ల వర్షాలు విస్తారంగా పడటం మొదలైంది. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో అమ్మకాలు తగ్గిపోయాయి. దీనికితోడు కంపెనీలు ఉత్పత్తిని పెద్ద ఎత్తున మార్కెట్‌లోకి తీసుకురావడంతో రేట్లు కూడా పడిపోయినట్టు చెప్తున్నారు. గత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధం (ఏప్రిల్-సెప్టెంబర్)లో 5 నుంచి 6 శాతానికే వృద్ధిరేటు పరిమితమైంది. 2020-21 కరోనా సమయంలో తర్వాత ఈ స్థాయి వృద్ధి కనిపించడం ఇదే.






## అమ్మాయిల పొట్టి పోరుకు ముహూర్తం
## మహిళల టీ20 ప్రపంచకప్ 2026 షెడ్యూల్ విడుదల

- జూన్ 12 నుంచి జులై 5 దాకా మెగా టోర్నీ
- పాక్ మ్యాచ్‌తో వేట ఆరంభించనున్న భారత్

క్రికెట్ అభిమానులకు వరుస ఏడాదుల్లో మెగా టోర్నీల మజాను అందించడానికి ఐసీసీ సిద్ధమైంది. ఈ ఏడాది భారత్, శ్రీలంక సంయుక్తంగా నిర్వహించతలపెట్టిన మహిళల వన్డే ప్రపంచ కప్‌నకు ఇటీవలే షెడ్యూల్ ప్రకటించిన ఐసీసీ.. తాజాగా వచ్చే ఏడాది ఇంగ్లండ్ ఆతిథ్యమివ్వబోతున్న మహిళల టీ20 వరల్డ్ కప్ షెడ్యూల్‌నూ విడుదల చేసింది. జూన్ 12 నుంచి మొదలుకాబోయే ఈ మెగా టోర్నీ జులై 5న క్రికెట్ పుట్టినిల్లు లార్డ్స్ వేదికగా జరుగబోయే ఫైనల్‌తో ముగుస్తుంది. ఏడు వేదికల్లో 12 జట్లు తలపడనున్న ఈ ధనాధన్ పోరులో.. జూన్ 30న తొలి, జులై 2న రెండో సెమీస్ జరుగనుంది. ఇంగ్లండ్‌లోని ఎడ్జ్‌బాస్టన్, హాంప్‌షైర్ బౌల్, హెడింగ్లీ, ఓల్డ్ ట్రాఫర్డ్, ది ఓవల్, బ్రిస్టల్ కౌంటీ గ్రౌండ్స్, లార్డ్స్‌లో మ్యాచ్‌లు జరుగనున్నాయి. జూన్ 12న ఆతిథ్య ఇంగ్లండ్.. ఎడ్జ్‌బాస్టన్‌లో శ్రీలంకతో జరుగబోయే మ్యాచ్‌తో టోర్నీ మొదలవనుంది. భారత జట్టు దాయాది పాకిస్థాన్‌తో జూన్ 14న ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగే మ్యాచ్‌తో టైటిల్ వేటను ఆరంభించనుంది. భారత్, ఆస్ట్రేలియా మధ్య జూన్ 28న లార్డ్స్‌లో జరిగే మ్యాచ్‌తో లీగ్ దశకు తెరపడనుంది.

**భారత షెడ్యూల్**

| తేదీ | ప్రత్యర్థి | వేదిక |
|---|---|---|
| జూన్ 14 | పాకిస్థాన్ | ఎడ్జ్‌బాస్టన్ |
| జూన్ 17 | క్వాలిఫయర్ | హెడింగ్లీ |
| జూన్ 21 | దక్షిణాఫ్రికా | ఓల్డ్ ట్రాఫర్డ్ |
| జూన్ 25 | క్వాలిఫయర్ | ఓల్డ్ ట్రాఫర్డ్ |
| జూన్ 28 | ఆస్ట్రేలియా | లార్డ్స్ |

**రెండు గ్రూపులు**

12 జట్లు పాల్గొననున్న ఈ టోర్నీలో జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్-1లో ఆరుసార్లు విజేత ఆస్ట్రేలియా, నిరుటి ఎడిషన్ రన్నరన్ దక్షిణాఫ్రికా, భారత్, పాకిస్థాన్‌తో పాటు రెండు క్వాలిఫయింగ్ టీమ్స్ (ఇంకా ఖరారు కాలేదు) ఉండగా.. గ్రూప్-2లో డిఫెండింగ్ చాంపియన్స్ న్యూజిలాండ్, వెస్టిండీస్, శ్రీలంక, ఇంగ్లండ్, రెండు క్వాలిఫయింగ్ టీమ్స్ ఉన్నాయి. లీగ్ దశ ముగిసేసరికి గ్రూప్‌లో టాప్-2లో ఉన్న నాలుగు జట్లు సెమీస్‌కు అర్హత సాధిస్తాయి.

# కూర్పుపై కసరత్తు




భారత క్రికెట్‌లో నవ శకానికి నాంది పడింది. కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ ఎంపికకు తోడు దేశవాళీ టోర్నీల్లో నిలకడగా రాణిస్తున్న యువ క్రికెటర్లకు జాతీయ జట్టులో చోటు దక్కింది. తాము పడ్డ కష్టానికి ప్రతిఫలంగా టీమ్‌ఇండియాకు ఎంపికైన యువ క్రికెటర్లు అవకాశాలను అందిపుచ్చుకుంటూ సత్తాచాటాలని చూస్తున్నారు. ముఖ్యంగా టీమ్‌ఇండియాకు తొలిసారి టెస్టు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న గిల్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఓవైపు కెప్టెన్సీ బాధ్యతలకు తోడు కీలకమైన బ్యాటింగ్‌తో జట్టును ముందుండి నడిపించాల్సిన అవసరం ఏర్పడింది. అంతోఇంతో ఇంగ్లండ్‌లో ఆడిన అనుభవమున్న కేఎల్ రాహుల్, బుమ్రా, సిరాజ్, పంత్, జడేజా పెద్ద దిక్కుగా కనిపిస్తున్నారు. డబ్ల్యూటీసీ 2025-27 సైకిల్‌లో తొలి టెస్టు సిరీస్ అయిన ఇంగ్లండ్‌తో పోరును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న టీమ్‌ఇండియా అందుకు తగ్గట్లు వ్యూహాలు రచిస్తున్నది. చీఫ్ కోచ్ గౌతం గంభీర్ మార్గదర్శకత్వంలో ఇంగ్లిష్ జట్టును దీటుగా ఎదుర్కోవడంపై దృష్టి సారించింది. ఇప్పటికే రెండు ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడి ఇక్కడి పరిస్థితులకు అలవాటు పడ్డ క్రికెటర్లు తొలి టెస్టుకు వేదికైన లీడ్స్‌లో సత్తాచాటేందుకు పట్టుదలతో ఉన్నారు. అయితే తుది జట్టు కూర్పుపై ఒకింత ఆసక్తి నెలకొన్నది.

ఇంగ్లండ్‌తో తొలి టెస్టులో ఓపెనర్లుగా యశస్వి జైస్వాల్‌కు తోడు కేఎల్ రాహుల్ వచ్చే అవకాశముంది. ఇంగ్లండ్ గడ్డపై తొలిసారి టెస్టు సిరీస్ ఆడబోతున్న జైస్వాల్ ఏ మేరకు జట్టుకు శుభారంభం అందిస్తాడన్నది చూడాలి. ఇంగ్లండ్ లయన్స్‌తో జరిగిన రెండు ప్రాక్టీస్ మ్యాచ్‌ల్లో అతడు 27.50 సగటుతో 110 రన్స్ చేశాడు. ఇంట్రాస్క్వాడ్ పోరులోనూ జైస్వాల్ అంతగా ఆకట్టుకోలేకపోయాడు. మరోవైపు ప్రస్తుత టీమ్‌లో సీనియర్ అయిన రాహుల్‌కు ఇంగ్లండ్‌లో 34.11 సగటు ఉంది. 2018(ఓవల్)లో 149కు తోడు, 2021లో 129 పరుగులు చేసిన అనువభం రాహుల్ సొంతం. దీనికి తోడు ఇంగ్లండ్ లయన్స్‌తో జరిగిన రెండో వామప్ మ్యాచ్‌లో సెంచరీ చేసిన రాహుల్ భారీ అంచనాలు కల్పించాడు. జైస్వాల్, రాహుల్ జట్టుకు మెరుగైన శుభారంభాన్ని ఇస్తే టీమ్‌ఇండియాకు తిరుగుండకపోవచ్చు. కీలకమైన మూడో స్థానం కోసం సాయి సుదర్శన్, కరుణ్ నాయర్, అభిమన్యు ఈశ్వరన్ మధ్య పోటీ ఏర్పడింది. ఇటీవల ముగిసిన ఐపీఎల్‌లో పరుగుల వరద పారించిన సుదర్శన్‌కు కౌంటీల్లో ఆడిన అనుభవం కలిసొచ్చే అంశం. దేశవాళీలో టన్నుల కొద్ది పరుగులు చేసి దాదాపు 7 ఏండ్ల తర్వాత తిరిగి జాతీయ జట్టులోకి వచ్చిన కరణ్‌ను ఎక్కడ ఆడించాలన్నదానిపై టీమ్ మేనేజ్‌మెంట్ తర్జనభర్జన పడుతున్నది. కౌంటీల్లో ఆడిన అనుభమున్న కరణ్ తొలి మ్యాచ్‌లో డబుల్ సెంచరీ (204) చేసి తన వాడిని చూపించాడు. మరోవైపు దేశవాళీల్లో నిలకడగా రాణిస్తూ జాతీయ జట్టులో అరంగేట్రం కోసం ఎదురుచూస్తున్న ఈశ్వరన్ రెండు ప్రాక్టీస్ మ్యాచ్‌ల్లో కెప్టెన్‌గా 41.75 సగటుతో 167 పరుగులు చేశాడు. కోహ్లీ రిటైర్మెంట్‌తో ఖాళీ అయిన నాలుగో స్థానాన్ని కెప్టెన్ గిల్ భర్తీ చేయనున్నాడు. టాపార్డర్ విఫలమైతే ఇన్నింగ్స్‌కు ఇరుసులా మారుతూ ఆటను చక్కదిద్దాల్సిన కీలక బాధ్యత గిల్ ఎత్తుకోవాల్సి వస్తుంది. ఇక ఐదో స్థానంలో రిషభ్ పంత్ రానున్నాడు. మిడిలార్డర్‌లో పంత్ దూకుడు టీమ్‌ఇండియాకు కలిసిరానుంది. సేనా (దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) దేశాల్లో 37 మ్యాచ్‌ల్లో 4 సెంచరీలు చేసిన అనుభవం పంత్ సొంతం. లోయార్డర్‌లో జడేజా ఆట చాలా కీలకం కానుంది. అటు బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్‌లో రాణించే సత్తా ఉన్న జడేజా క్లిష్టమైన సమయాల్లో జట్టకు ఆపద్భాంవునిలా నిలిచిన సందర్భాలు ఉన్నాయి. పేస్ ఆల్‌రౌండర్ విషయానికొస్తే శార్దుల్ ఠాకూర్, నితీశ్‌కుమార్ మధ్య పోటీ నెలకొన్నది. ఇంట్రాస్క్వాడ్ మ్యాచ్‌లో సెంచరీతో చెలరేగిన శార్దుల్ తనపై నమ్మకాన్ని నిలబెట్టుకున్నాడు. దీనికి తోడు ఇంగ్లండ్‌లో ఆడిన అనుభవం శార్దుల్‌కు అదనపు బలం కానుండగా, నితీశ్ స్థానంపై సందిగ్ధత నెలకొన్నది.

## బుమ్రా సారథ్యంలో..

పేస్ దళానికి జస్‌ప్రీత్ బుమ్రా సారథ్యం వహించనున్నాడు. దాదాపు ఆరు నెలల తర్వాత టెస్టులు ఆడబోతున్న బుమ్రా..ఇంగ్లండ్‌ను ఎదుర్కోవడంలో చాలా కీలకం కానున్నాడు. వేగానికి తనదైన స్వింగ్ జోడిస్తూ ప్రత్యర్థి బ్యాటర్లను ఉక్కిరిబిక్కిరి చేయడంలో ఆరితేరిన బుమ్రా..టీమ్‌ఇండియాకు తురుపుముక్క. ఆదిలోనే ఇంగ్లండ్‌ను దెబ్బతీస్తే..మిగతాపనిని సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ కానిచ్చే అవకాశముంది. ఫిట్‌నెస్ సమస్యలకు తోడు పేస్ భారాన్ని అంచనా వేస్తూ బుమ్రాను సిరీస్‌లో బరిలోకి దింపాల్సిన అవసరముంది. హైదరాబాదీ స్పీడ్‌స్టర్ మహమ్మద్ సిరాజ్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. భారత పేస్ బౌలింగ్‌కు పిల్లర్‌గా భావిస్తున్న సిరాజ్ విరామం లేకుండా బౌలింగ్ చేయడంలో దిట్ట. ఐపీఎల్ లోమెరుపులు మెరిపించిన ప్రసిద్ధ్ సత్తాచాటితే టీమ్‌ఇండియా బౌలింగ్ కష్టాలు తీరినట్లే. వీరికి తోడు అర్ష్‌దీప్‌సింగ్, ఆకాశ్‌దీప్, కుల్దీప్‌యాదవ్ జతకలిస్తే భారత సుదీర్ఘ కల నెరవేరినట్లే.






## నన్ను పెళ్లి చేసుకుంటావా.. ? నెటిజన్ రిక్వెస్ట్?కు రాజాసాబ్ హీరోయిన్ కౌంటర్..



తక్కువ సమయంలోనే సౌత్ ఇండస్ట్రీలో స్టార్ స్టేటస్ సంపాదించుకున్న హీరోయిన్ మాళవిక మోహనన్. తమిళంలో సూపర్ స్టార్ రజినీకాంత్ తో నటించిన ఈ ముద్దుగుమ్మ ఇప్పుడు తెలుగు సినిమాల్లోకి ఎంట్రీ ఇస్తుంది. ప్రస్తుతం యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తోన్న రాజాసాబ్ చిత్రంలో నటిస్తుంది. ఈ సినిమాతో తెలుగు తెరకు పరిచయం కాబోతుంది. మాళవిక మోహనన్ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరంలేదు. ఇన్నాళ్లు తమిళం, మలయాళం భాషలలో పలు హిట్ చిత్రాల్లో నటించి మెప్పించింది. ఇప్పుడు యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ సరసన రాజాసాబ్ చిత్రంలో నటిస్తుంది. డైరెక్టర్ మారుతి తెరకెక్కిస్తోన్న ఈ మూవీలో మాళవిక మోహనన్ తోపాటు నిధి అగర్వాల్, రిద్ది కుమార్ సైతం హీరోయిన్లుగా నటిస్తున్నారు. హారర్ కామెడీ డ్రామాగా రాబోతున్న ఈ మూవీపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఇక ఇటీవల విడుదలైన టీజర్ మూవీపై మరింత హైప్ క్రియేట్ చేసింది. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ వేగంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే.. తెలుగుతోపాటు హిందీలోనూ పలు సినిమాల్లో నటిస్తుంది మాళవిక. మరోవైపు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటూ నిత్యం ఏదోక పోస్ట్ చేస్తూ సందడి చేస్తుంటుంది మాళవిక. తాజాగా ట్విట్టర్ వేదికగా అభిమానులతో చిట్ చాట్ నిర్వహించింది. ఈ క్రమంలో ఓ అభిమాని పెళ్లి గురించి అడగ్గా ఫన్నీ ఆన్సర్ ఇచ్చింది. నన్ను పెళ్లి చేసుకుంటారా ? అని ఓ నెటిజన్ అడగ్గా.. తనకు దెయ్యాలంటే భయమని మాళవిక రిప్లై ఇచ్చారు. అతడి ఎక్స్ ఖాతా పేరు ఘోస్ట్ అని ఉండడంతో ఆమె అలా ఆన్సర్ ఇచ్చారు. దీంతో ఇప్పుడు మాళవిక ఇచ్చిన రిప్లై ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరలవుతుంది. అలాగే రాజాసాబ్ సినిమాలో ప్రభాస్ తో ఓ మాస్ సాంగ్ ఆశించవచ్చా అని అడగ్గా.. తప్పకుండా అంటూ ఆన్సర్ ఇచ్చింది. అలాగే ది రాజాసాబ్ ప్రమోషన్లలో తాను సైతం పాల్గొంటానని తెలిపింది. మోహన్ లాల్ సినిమాలు చూస్తూ పెరిగానని.. ఆయనతో కలిసి నటించడం ఆనందంగా ఉందని చెప్పుకొచ్చింది. ది రాజాసాబ్ సినిమాతోపాటు సర్దార్ 2, హృదయపూర్వం చిత్రాల్లో నటిస్తున్నట్లు తెలిపింది. అలాగే తనకు డైరెక్టర్ రాజమౌళి దర్శకత్వంలో పనిచేయాలని ఉందంటూ చెప్పుకొచ్చింది.



## భాగ్యనగరిలో 'పెద్ది' పోరాటాలు

రామ్‌చరణ్ నటిస్తున్న రూరల్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' నిర్మాణం నుంచే దేశవ్యాప్తంగా భారీ హైప్ క్రియేట్ చేస్తున్నది. ముఖ్యంగా ఫస్ట్‌గ్లింప్స్ ఒక్కసారి సినిమాపై అంచనాల్ని పెంచింది. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ ఈ పాన్ ఇండియా చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో యాక్షన్ ఘట్టాలను తెరకెక్కిస్తున్నారు. ఇందులో ట్రైన్ సెట్‌ను తీర్చిదిద్దారు కళా దర్శకుడు అవినాష్ కొల్లా. రామ్‌చరణ్ రిస్కీ స్టంట్స్ చేస్తున్నారని, 'పుష్ప-2'తో పేరుపొందిన యాక్షన్ కొరియోగ్రాఫర్ నబాకాంత్ ఈ ఫైట్ సీక్వెన్స్‌కు రూపకల్పన చేశారని చిత్రబృందం పేర్కొంది. భారతీయ సినీ చరిత్రలో యాక్షన్ పరంగా కొత్త ప్రమాణాలను నిర్దేశిస్తూ ఈ యాక్షన్ ఎపిసోడ్‌ను తెరకెక్కిస్తున్నామని నిర్మాతలు తెలిపారు. క్రికెట్, మల్లయుద్ధంతో పాటు మరికొన్ని గ్రామీణ క్రీడల నేపథ్యంలో యాక్షన్‌గా డ్రామాగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 27న విడుదలకానుంది. జాన్వీకపూర్, శివరాజకుమార్, జగపతిబాబు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, రచన-దర్శకత్వం: బుచ్చిబాబు సానా.



Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020